ప్రజాశక్తి

సోమవారం 10 ఫిబ్రవరి 2025 8 పేజీలు

ఎన్‌టిఆర్

కృష్ణా

ప్రజా గొంతుక లక్ష్మణరావు

కెఎస్ లక్ష్మణరావు

- అన్ని తరగతుల ప్రజల సమస్యలపై నిరంతర పోరాటం
- రాజకీయాలకు అతీతంగా ఎంఎల్‌సిగా 14 ఏళ్ల ప్రస్థానం
- మండలి బరిలో మరోసారి పోటీ
- నేడు గుంటూరులో నామినేషను దాఖలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో శాసన మండలి పునరుద్ధరణ తరువాత సుదీర్ఘకాలం పనిచేసిన ఎమ్మెల్సీల్లో కె.ఎస్.లక్ష్మణరావు ప్రముఖంగా నిలుస్తున్నారు. గుంటూరు :హిందూ కళాశాల అధ్యాపకుడిగా పనిచేస్తూ 2007లో తొలి సారిగా శాసన మండలి సభ్యులుగా ఆయన ఎన్నికయ్యారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆయన నాలుగు సార్లు ఎమ్మెల్సీగా పనిచేశారు. ఐదో సారి ఆయన ఈ నెల 27న కృష్ణా, (మిగతా 2లో)

నేడు గుంటూరులో నామినేషన్

కృష్ణా, గుంటూరు జిల్లా పట్టభద్రుల నియోజకవర్గానికి పోటి చేస్తున్న సిట్టింగ్ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు సోమవారం నామినేషను దాఖలు చేయనున్నారు. ఉదయం 10 గంటలకు గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగే సభలో పాల్గొని అనంతరం ర్యాలీగా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లనున్నారు. రాజ్యాంగ నిర్మాతలు దూరదృష్టితో టీచర్లు, గ్రాడ్యుయేట్ల సమస్యలపై ప్రాతినిధ్యం కోసం ఏర్పాటు చేసిన టీచర్స్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాల్లోనూ రాజకీయ పార్టీలు నేరుగా పోటీ చేస్తున్నాయని ఈ సందర్భంగా లక్ష్మణరావు అన్నారు. ఈ నేపథ్యంలో ప్రజా సమస్యల సమస్యలకు మండలిలో గొంతుకగా ఉంటానని తనకు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. నామినేషన్ కార్యక్రమంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు, ఇతర ప్రజా సంఘాల కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యత

మంత్రి సత్యకుమార్‌యాదవ్

అత్యాధునిక పెద్దేశ్వర్ హెల్త్ కేర్ సెంటర్ ప్రారంభం

వార్త 8లో

యంత్రం... యాతన

- ఈ సీజన్‌లోనూ అందుబాటులోకి రాని డ్రోన్‌లు
- కృష్ణాజిల్లాకు మంజూరైనవి 35
- శిక్షణ పొందిన పైలెట్లు 21 మంది
- యూనిట్ వ్యయం రూ.10 లక్షలు, రాయితీ రూ.8 లక్షలు

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

రైతులకు సాగును సులభతరం చేసేందుకు ఆధునిక టెక్నాలజీని అందుబాటులోకి తీసుకువస్తామని ప్రభుత్వాలు చెబుతున్న మాటలు కోటలు దాటుతున్నా ఆచరణ గడపదాటడం లేదు. పంటలపై మందులు, ఎరువుల పిచికారీకి డ్రోన్లను రాయితీపై అందిస్తామని చెప్పిన మాటలు దీనికి అద్దం పడుతున్నాయి. రెండేళ్లుగా ఎదురు చూస్తున్న రైతులకు ఈ సీజన్‌లోనూ నిరాశే మిగిలింది.

గత వైసిపి ప్రభుత్వ హయాంలోనూ 2022 నవంబర్‌లో రైతు గ్రూపులకు (మిగతా 2లో)

WANTED

ప్రజాశక్తి దినపత్రిక

విజయవాడ సిటీ, తిరువూరు, మచిలీపట్నంలలో పనిచేసేందుకు సిబ్బంది కావలెను.

- విజయవాడ సిటీ - మార్కెటింగ్ ఇన్‌ఛార్జి, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లు, విలేఖర్లు
- ఎన్‌టిఆర్ జిల్లా - స్టాఫ్ రిపోర్టర్
- తిరువూరు - డివిజన్ కో-ఆర్డినేటర్/మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్
- మచిలీపట్నం - డివిజన్ కో-ఆర్డినేటర్/మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్

ఆకర్షణీయమైన వేతనం, అలవెన్సులు ఇవ్వబడును.

ప్రజాశక్తి భవన్

అమరారెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరుజిల్లా.

సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్: 94900 99 206

గుణదల లూర్దుమాత ఉత్సవాలు ప్రారంభం

వార్త 2లో

గుణదల లూర్దుమాత ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

దేవుని మార్గంలో నడిపించటానికి మరియమాత అనేక ప్రాంతాలలో యాత్రికులకు దర్శనమిచ్చిందని విజయవాడ కతోలిక పీఠం బిషప్ మోస్ట్ రెవ.తెలగతోటి జోసఫ్ రాజారావు అన్నారు. గుణదల కొండపై కొలువైన గుణదల (లూర్దు) మాత 101వ మహోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఉదయం ఏడు గంటలకు బిషప్ గ్రాసి హైస్కూల్ గ్రౌండ్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కళావేదికపై విజయవాడ కతోలిక పీఠం బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు, మోన్సిన్యోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, వికర్ జనరల్ ఫాదర్ మేశపాం గాబ్రియేలు, పుణ్యక్షేత్రం రెక్టర్ యేలేటి విలియం జయరాజు స్వామి, తదితర గురువులు జ్యోతి ప్రజ్వలన చేసి అధికారికంగా ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా బిషప్ రాజారావు ప్రారంభ సందేశమిస్తూ 2025 సంవత్సరాన్ని జగద్గురువులు పరిశుద్ధ పోప్ ఫ్రాన్సీస్ జూబ్లీ సంవత్సరంగా ప్రకటించటం జరిగిందన్నారు. గుణదలమాత పుణ్యక్షేత్రం అద్భుతాల నిలయంగా విరాజిల్లుతోందన్నారు. స్వర్ణ జూబిలేరియన్ ఫాదర్ పుతుకులంగర (పి.కె.) జోసఫ్ వ్యాకోపదేశం చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన పూజాపీఠంపై స్వర్ణ జూబిలేరియన్ ఫాదర్ పి.కె.జోసఫ్ కలిసి బిషప్ జోసఫ్ రాజారావు, మోన్సిన్యోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, వికార్ జనరల్ ఫాదర్ యం. గాబ్రియేలు, పుణ్యక్షేత్రం రెక్టర్ యేలేటి విలియం జయరాజు, ఎడ్యుకేషన్ డస్క్ డైరెక్టర్ ఫాదర్ కొలకాని మరియన్న, ఎస్ఎస్సి డైరెక్టర్ ఫాదర్ తోట సునీల్ రాజు, డయోసిస్కు చెందిన గురువులు ప్రారంభ పవిత్ర సమిష్టి దివ్యపూజాబలి సమర్పించారు. పూజానంతరం రెవ, మోన్సిన్యోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, ఫాదర్ వల్లె జోజిబాబు, ఫాదర్ పసల తోమస్ తదితర గురువులు దివ్య సత్ప్రసాదం అందజేశారు. సాయంత్రం మూడు గంటలకు గుణదల పురవీధుల్లో గుణదలమాత స్వరూపాన్ని పుణ్యక్షేత్రం రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు ఆధ్వర్యంలో ఊరేగించారు.

బందోబస్తు ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-విజయవాడ: నగర పోలీస్ కమిషనర్ ఎస్‌వి రాజశేఖర్‌బాబు గుణదల మేరీ మాత టెంపుల్, పరిసర ప్రాంతాలను స్వయంగా పర్యవేక్షించి బందోబస్త్ విధులు నిర్వహించు అధికారులకు, సిబ్బందికి తగు సూచనలు, సలహాలను అందించారు. అనంతరం గుణదల టెంపుల్ సమీపంలో ఏర్పాటు చేసిన పోలీస్ మినీ కమాండ్ కంట్రోల్ నుండి సీసీ కెమెరాల ద్వారా, డ్రోన్ కెమెరాల ద్వారా పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ ఈసారి ప్రత్యేకంగా మేరీ మాత టెంపుల్, పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు డ్రోన్లతో ఆధునిక సాంకేతికను ఉపయోగించుకుని పకడ్బందీగా భద్రత ఏర్పాట్లు చేశామని అన్నారు. పెద్ద ఎత్తున యాత్రికులు రానున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎంతో అప్రమత్తంగా బందోబస్తు విధులు నిర్వహించాలని, యాత్రికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఎప్పటికప్పుడు సిబ్బందికి సూచనలిస్తూ అధికారులు విధులు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిసిపి గౌతమి షాలి, ట్రైనీ ఐపీఎస్ మనిషా పాల్గొన్నారు.

ఉత్సవాలను ప్రారంభిస్తున్న జోసఫ్ రాజారావు

పాత పెన్షన్ విధానం అవకాశం కల్పించాలి : లక్ష్మణరావు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్: 2003 డీఎస్సీ అభ్యర్థులకు తప్పనిసరిగా పాత పెన్షన్ విధానాన్ని అవకాశం కల్పించాలని, కృష్ణా, గుంటూరు జిల్లాల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు అన్నారు. ఆదివారం గుంటూరు జిల్లా ఎంటిఎంసీ పరిధిలోని కుంచనపల్లి అరవింద హైస్కూల్లో డీఎస్సీ 2003 టీచర్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు మోపిదేవి శివశంకరరావు అధ్యక్షతన 2003 ఉపాధ్యాయుల సమస్యపై సమావేశం జరిగింది. సుమారు 500 మందికి పైగా డీఎస్సీ 2003 అభ్యర్థులు పాల్గొన్న ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన లక్ష్మణరావు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాములో పిడిఎఫ్ ఎమ్మెల్సీగా ప్రాతినిధ్యం వహించామని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో నెంబర్ 57 ప్రకారం 2003 డిఎస్సీ అభ్యర్థులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ఆర్థిక శాఖ కార్యదర్శి శ్రీమతి జానకిని కలిసి 2003 అభ్యర్థుల పాత పెన్షన్ అమలు చేయాలని కోరా మని అన్నారు. ఓ పి ఎస్ విధానం వచ్చేవరకు పోరాటంలో భాగస్వామ్యం అవుతామని, ఉద్యమాలలో సంపూర్ణ మద్దతు ఇస్తామని ఆయన తెలిపారు. రేపు రాబోయే శాసనమండలి సమావేశాలలో ప్రస్తావన తెస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో తెలుగుదేశం ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, తెలుగుదేశం రాష్ట్ర కార్యాలయం ఇన్చార్జి ఎమ్మెల్సీ పరుచూరి అశోక్ బాబు, కష్ణ గుంటూరు గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకష్ణ, తదితరులు పాల్గొని ప్రసంగించారు. 11వేల మందికి పైగా పాత పెన్షన్ ఇవ్వాల్సి ఉన్న గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, ఈ సమస్యను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరించేందుకు కషి చేస్తామని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ ఉద్యోగ సంఘాల నాయకులు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేఆర్ సూర్యనారాయణ, ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాలాజీ, ఫోరం కన్వీనర్ ఎం గురు బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న లక్ష్మణరావు

బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడ: స్థానిక దండమూడి రాజగోపాలరావు ఇండోర్ స్టేడియంలో ఎన్టీఆర్, కృష్ణాజిల్లాలకు చెందిన క్రీడాకారులతో బ్యాట్మింటన్ టోర్నమెంట్ ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని టోర్నమెంట్‌ను ప్రారంభించి సరదాగా కాసేపు బ్యాట్మింటన్ ఆడారు. ఈ టోర్నమెంట్‌కు రెండు జిల్లాలకు చెందిన 84 జట్లు వివిధ విభాగాల్లో పాల్గొంటున్నాయి. ఈ పోటీల్లో పాల్గొని గెలుపొందిన విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.11,111, రెండవ బహుమతిగా రూ.7,777, మూడవ బహుమతిగా రూ.4,444, నాలుగో బహుమతిగా రూ.2,222 అందజేస్తారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ 1991 బ్యాచ్‌కి చెందిన పోలీస్ అధికారులు చాలా మంచి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. 34 సంవత్సరాలు తర్వాత కూడా వీరికి ట్రైనింగ్ ఇచ్చిన అధికారి జయంతిరావు మరణించిన సమయంలో వారి కుటుంబానికి అండగా ఉంటూ వారిని స్మరించుకుంటూ అనాథ వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారన్నారు. ఇదే రీతిలో మున్ముందు మంచి కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎడిసిపి ప్రసన్న కుమార్, 1991 బ్యాచ్ పోలీస్ అధికారులు పివి మారుతీరావు, దామోదర్‌రావు, రవికాంత్, సుభాకర్, సత్యానందం, వంశీధర్ గౌడ్, ధర్మేంద్ర, రాజీవ్ కుమార్, పి.భాస్కర రావు, రఘురాం మోహన్, విజయ భాస్కర్, వర్మ, కిషోర్, డి ప్రసాద రావు, ఆర్ఐలు శ్రీనివాసరావు, రాజశేఖర్, రవితేజ పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ ఆడుతున్న సిపి రాజశేఖరబాబు

పిజిఆర్ఎస్‌కు తాత్కాలిక విరామం

ప్రజాశక్తి-విజయవాడ: కృష్ణా, గుంటూరు శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గానికి ఎన్నికల షెడ్యూల్ విడుదలతో ఎన్‌టిఆర్ జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి తాత్కాలిక విరామం ప్రకటించడం జరిగిందని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 8వ తేదీ వరకుకలెక్టరేట్, రెవెన్యూ డివిజన్లు, మండల కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాలలో నిర్వహించే పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సెల్ సిస్టం కార్యక్రమానికి తాత్కాలిక విరామం ప్రకటించినట్లు పేర్కొన్నారు. ప్రజలు తమ అర్జీని మీకోసం ఆన్లైన్ పోర్టల్‌లో నమోదు చేసుకోవచ్చుని, ఇందుకు తమ సమీప గ్రామ, వార్డు సచివాలయాన్ని సంప్రదించవచ్చని కలెక్టర్ తెలిపారు.

మొదటిపేజీ తరువాయి

ప్రజా గొంతుక లక్ష్మణరావు

గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికల్లో పోటీ చేయనున్నారు. 14 ఏళ్ల పాటు సుదీర్ఘకాలం ఎమ్మెల్సీగా పనిచేసిన ఆయన అన్ని తరగతుల ప్రజల గొంతుకగా పనిచేశారు. రైతులు, వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులు, మహిళలు, అంగన్‌వాడీలు, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక వర్గాలతో పాటు పింఛనర్లు వివిధ తరగతులకు చెందిన సమస్యలపై మండలిలో పోరాడారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్రను పోషించారు. 2014 వరకు కాంగ్రెస్, 2014 నుంచి 2019 వరకు టిడిపి, 2019 నుంచి 2024 వరకు వైసిపి, తిరిగి ఇప్పుడు టిడిపి కూటమి ప్రభుత్వంలో కూడా వివిధ అంశాలపై మండలి సమావేశాల్లో ఆయన స్పందించారు. మండలిలో ఆయా వర్గాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లటంతోపాటు, బయట జరిగే ప్రజా ఉద్యమాల్లో కూడా భాగస్వాములయ్యారు. గుంటూరు, కృష్ణా జిల్లాల్లో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న అనేక సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారు. ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల్లోనూ గుంటూరు ఛానల్, వరికెపుడిశెల, కౌలు రైతుల సమస్యలు, పట్టణాల్లో మౌలిక వసతులు, ఆర్‌వోబిలు, ఆర్‌యుబిలు, తాగునీరు, ట్రాఫిక్ సమస్యలపై కూడా మండలితో పాటు గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్‌లో కూడా పోరాటం కొనసాగిస్తున్నారు. లక్ష్మణరావు పోరాటం ఫలితంగా గుంటూరులో ఇప్పటికే పలు ఆర్‌వోబిలు మంజూరు అయ్యాయి. పట్టణ ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు లేక ఇబ్బంది పడుతున్న వేలాది మందికి పట్టాలు ఇప్పించేందుకు, ప్రభుత్వ భూములలో ఇళ్లు నిర్మించుకుని నివశిస్తున్న వారికి క్రమ బద్ధీకరణ పట్టాలు ఇప్పించేందుకు వివిధ దశల్లో జరిగిన పోరాటాల్లో ఆయన కీలకంగా వ్యవహరించారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఏ కొండూరు మండలంలో కిడ్నీ బాధితుల సమస్యలపై లక్ష్మణరావు మండలిలో ప్రముఖంగా ప్రస్తావించి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి బాధితులను అదుకునేలా కృషి చేశారు. అలాగే జలజీవన్ మిషన్ పథకం ద్వారా ఈ మండలంలోని ప్రజలకు తాగునీటి పథకం మంజూరుకు ప్రభుత్వంపై వత్తిడి చేసి మంజూరు చేయించారు. గంపలగూడెం మండలంలో కట్లేరు వాగుపై బ్రిడ్జి నిర్మాణం కోసం పలు మార్లు మండలిలో ప్రస్తావించారు. ప్రభుత్వ అధికారులతో చర్చించి బ్రిడ్జి నిర్మాణం కోసం కృషి చేశారు. మామిడి రైతుల సమస్యలపై ప్రభుత్వంతో చర్చించారు. మిర్చి రైతులు, సుబాబుల సాగు దారుల సమస్యలపై పలు మార్లు అధికారులతో చర్చించడం, మండలిలో ప్రస్తావించడం, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. అనేక అంశాలపై నిరంతరం పోరాడుతున్నామన్నారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ప్రజామోద నిర్ణయాలు తీసుకుంటే మద్ధతు ఇస్తూ ప్రజా వ్యతిరేక నిర్ణయాలపై పోరాటం కొనసాగించారు. అధికార పార్టీకి చెందిన అభ్యర్థులు ప్రజా సమస్యల పరిష్కారానికి చేసే కృషి కన్నా ప్రతిపక్ష పాత్ర పోషించే తనను ఎన్నుకుంటే ప్రజలందరికీ న్యాయం జరుగుతుందని కె.ఎస్.లక్ష్మణరావు చెప్పారు.

యంత్రం...యాతన

డ్రోన్‌లను అందిస్తామని వ్యవసాయశాఖ దరఖాస్తులను స్వీకరించింది. కొందరు డ్రోన్ పైలెట్లకు శిక్షణ ఇచ్చింది. అప్పటి ప్రభుత్వం డ్రోన్‌లను మంజూరు చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం చేసింది. 2024 అక్టోబర్ చివరి వారంలో విజయవాడలో అమరావతి డ్రోన్ షోను కూటమి ప్రభుత్వం అత్యంత వైభవంగా నిర్వహించింది. వ్యవసాయ రంగంలోనూ డ్రోన్లను ప్రవేశపెడతామని ప్రకటించింది. ఈ నేపథ్యంలోనే కృష్ణాజిల్లాకు 35 డ్రోన్‌లు మంజూరు చేసింది. ఒక్కో యూనిట్ వ్యయాన్ని రూ.10 లక్షలుగా పేర్కొంటూ రైతు గ్రూపుకు 80 శాతం (రూ.8 లక్షలు) రాయితీ ఇస్తామని ప్రకటించింది. ఆసక్తి గల రైతు గ్రూపుల నుంచి వ్యవసాయ శాఖ దరఖాస్తులను స్వీకరించింది. ఈ క్రమంలోనే దరఖాస్తు చేసుకున్న రైతు గ్రూపుల్లో 21 మంది డ్రోన్ పైలెట్ల్‌కు శిక్షణ ఇచ్చారు. మిగిలిన 14 గ్రూపుల్లోని డ్రోన్ పైలెట్లకు శిక్షణ ఇవ్వడానికి వ్యవసాయ శాఖ సన్నాహాలు చేస్తోంది. ఎంపికైన రైతు గ్రూపులకు డ్రోన్‌లు ఎప్పుడు మంజూరు చేస్తారనే దానిపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో డ్రోన్‌లకు దరఖాస్తులు చేసిన రైతులు 16 నెలలుగా ఎదురు చూస్తున్నారు.

సీజన్‌లోనూ అక్కరకు రాని వైనం

ఖరీఫ్, రబీ సీజన్లలో వ్యవసాయ పనులు ఎక్కువగా ఉంటాయి. జూన్ నుంచి మార్చి మధ్యకాలంలో పంటల సాగు జరుగుతుంది. ఈ కాలంలోనే వరి, అపరాలు, ఉద్యాన పంటలకు ఎరువులు, పురుగు మందుల పిచికారీ ఎక్కుగా జరుగుతుంది. కొన్ని సందర్భాల్లో సాధారణ హ్యాండ్, పవర్, తైవాన్ స్ప్రేయర్లుతో మందులు, ఎరువులు పిచికారీ చేయలేని పరిస్థితి ఏర్పడుతోంది. ప్రయివేటుగా డ్రోన్‌లను అద్దెకు తీసుకుని రైతులు వినియోగించుకుంటున్నారు. ఒక్కో ఎకరా పిచికారీకి రూ.400 వరకు అద్దె చెల్లిస్తున్నారు. ప్రభుత్వ ప్రకటనతో ఈ రబీ సీజన్‌లో డ్రోన్‌లు అందుబాటులోకి వస్తాయని, తద్వారా అంతో ఇంతో ఆదాయం సమకూరుతుందని రైతు గ్రూపులు ఆశించాయి. మరో నెల రోజుల్లో సీజన్ ముగుస్తున్నా డ్రోన్‌ల మంజూరుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది.

గాయత్రికి సిపి అభినందన

ప్రజాశక్తి-విజయవాడ: నాగాయలంకకు చెందిన నాగిడి గాయత్రి ఇటీవల ఉత్తరాఖండ్ రిషికేష్‌లో జరిగిన 38వ జాతీయస్థాయి క్రీడాపోటీల్లో కెనాయ్ స్లాలమ్ కె-1 విభాగంలో గోల్డ్ మెడల్ సాధించింది. ఈ సందర్భంగా తల్లిదండ్రులతో కలిసి పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సిపి ఎస్.వి.రాజశేఖరబాబును మర్యాద పూర్వకంగా కలిశారు. క్రీడాకారిణి గాయత్రిని సిపి అభినందించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం దుశ్శాలువాతో సత్కరించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలవాలని, రాష్ట్ర కీర్తిని దేశ వ్యాప్తంగా ఇనుమడింప చేయాలని సూచించారు. ఈ సందర్భంగా గాయత్రి మాట్లాడుతూ తను ఈ స్థాయికి రావడంలో పోలీసు హెడ్ కానిస్టేబుల్ తిప్పిరెడ్డి శివారెడ్డి తర్ఫీదు, ఇన్స్పెక్టర్ కోమాకుల శివాజీ, పారిశ్రామిక వేత్త అప్పికట్ల అప్పారావు, మరికొంతమంది దాతల సహకారం, ప్రభుత్వ ప్రోత్సాహం ఎంతో కీలకమని తెలిపారు. తనకు ప్రభుత్వం నుంచి అందుతున్న సహకారంతో తప్పకుండా ఏషియన్ గేమ్స్‌లోనూ, ఒలింపిక్‌లోనూ పతకాలు సాధిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ కోమాకుల శివాజీ, శ్రీధర్, హెడ్ కానిస్టేబుల్ శివారెడ్డి పాల్గొన్నారు.

ఎంఎల్‌సి ఎన్నికలకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు

విజయవాడ: కృష్ణా, గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఎన్నికల నిర్వహణ కోసం గుంటూరు కలెక్టరేట్‌లో 24 గంటలూ పని చేసేలా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. కంట్రోల్ రూమ్ నెంబర్ 0863-2241029ను అందుబాటులోకి తీసుకొచ్చారు. కృష్ణా, గుంటూరు పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలకు సంబంధించి ఏమైనా ఫిర్యాదులు చేయడానికి, ఎన్నికల సమాచారం తెలుసుకోవడానికి కంట్రోల్ రూమ్‌కి ఫోన్ చేయవచ్చని అధికారులు తెలిపారు.

వైభవంగా వీరమ్మ తల్లి గ్రామోత్సవం

పల్లకిలో ఊరేగుతున్న వీరమ్మతల్లి

భక్తులకు పాలు, మజ్జిగ, వాటర్ ప్యాకెట్లు అంద జేస్తున్న సంస్థలు

ప్రజాశక్తి-ఉయ్యూరు : వీరమ్మతల్లి గ్రామోత్సవానికి వేలాదిగా భక్తులుతరలివచ్చారు. తిరునాళ్ల జరుపుకునేందుకు రావిచెట్టు సెంటర్ సమీపాన మెట్టినింటి నుంచి శనివారం రాత్రి బయలుదేరిన అమ్మవారు మేళతాళాలు, డప్పువాయిద్యాల నడుమ ఆదివారం గ్రామోత్సవం వైభవం గా జరుపుకున్నారు. వేలాదిగా తిరుగు గండదీపాల భక్తులు వెంటరాగా పురవీధుల్లో ఊరేగారు. గ్రామోత్సవంలో అమ్మవారికి దీపారాధన, పసుపు కుంకుమ అందచేసి అ మ్మవారి పల్లకి వెంట నడిచారు. గ్రామోత్సవం అనంతరం ఊయల స్తంబాల వద్ద ఊయలలూగి ప్రధాన రహదారిపై ఉన్న ఆలయానికి రాత్రికి చేరు కున్నారు.

భక్తులకు పాలు, మజ్జిగ పంపిణీ

వీరమ్మతల్లి తిరునాళ్లలో భక్తులకు ఆదివారం వివిద సంస్థలు, వ్యాపారస్తులు, వ్యక్తులు పాలు, మజ్జిగ, వాటర్ ప్యాకెట్లు పంపిణీచేశారు. తిరునాళ్లలో అమ్మవారికి తిరుగుగండ దీపాల మొక్కులు ఉన్న భక్తులు ఉపవాసం ఉండి అమ్మవారి పల్లకి వెంట గండదీపా లతో తిరగడం పరిపాటి. కాగా అమ్మవారి వెంట గండదీపాలతో అమ్మవారి పల్లకి వె ంట నడుస్తున్న వేలాది మంది భక్తులకు లయన్స్ క్లబ్ సభ్యుడు, సత్యదేవ ఫైనాన్స్ అధినేత సగ్గున రామ సత్యకిషోర్, శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భక్తులకు బాదంపాలు, వాటర్ ప్యాకెట్లు పంపిణీచేశారు. ఏజీఆండ్ఎస్ కళాశాల వాకర్స్ అసోసియేషన్, సుధీర్ టింబర్ డిపో ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. బీఎస్ఎన్ఎల్ కార్యాలయం సమీపాన డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రెడ్డిరమణ, సాంబశివరావు, విజయడైరీ సూపర్వైజర్ పవన్ ఆధ్వర్యంలో వెయ్యిమందికి మజ్జిగ పంపిణీచేశారు.

తిరునాళ్లలో అధికారుల పర్యవేక్షణ

వీరమ్మతిరునాళ్లలో ఏవిధమైన అవాంచనీయ సంఘటనలు జరుగకుండా అధికారు లు పర్యవేక్షిస్తున్నారు. అమవారి గ్రామోత్సవం సందర్భంగా, ఆలయం వద్ద ఏర్పాట్లు, భక్తులకు సౌకర్యాలను మండల తహసీల్దార్ ఎం సురేశ్ కుమార్, ఉయ్యూరు కమిషనర్ వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ శేషగిరిరావు, ఆర్ఎ యతేంద్రియులు, వీఆర్వోలు, అగ్నిమా పక అధికారి శ్రీనివాస్ ఇతర అధికారులు రెండురోజులనుంచి పర్య వేక్షిస్తూ ఎప్పటి కప్పుడు పరిస్థితులు తెలుసుకుంటున్నారు.

'మీకోసం'కు తాత్కాలిక విరామం

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : కృష్ణా - గుంటూరు శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గానికి ఎన్నికల షెడ్యూల్ విడుదలతో జిల్లాలో కోడ్ అమల్లో ఉన్నందున సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి తాత్కాలిక విరామం ప్రకటించినట్లు కలెక్టర్ డి.కే బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. భారత ఎన్నికల సంఘం శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికకు జనవరి 29వ తేదీన షెడ్యూల్ విడుదల చేసిన తక్షణమే ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ) అమల్లోకి వచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ నెల మూడవ తేదీ నుంచి మార్చి 8వ తేదీ వరకు ప్రతి సోమవారం కలెక్టరేట్, రెవెన్యూ డివిజన్లు, మండల కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాలలో నిర్వహించే పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సెల్ సిస్టం కార్యక్రమానికి తాత్కాలిక విరామం ప్రకటించామని కలెక్టర్ డి.కే బాలాజీ ఆ ప్రకటనలో తెలిపారు.అయితే ప్రజలు తమ అర్జీని మీకోసం ఆన్లైన్ పోర్టల్ లో నమోదు చేసుకోవచ్చుని.. ఇందుకు తమ సమీప గ్రామ లేదా వార్డు సచివాలయాన్ని సంప్రదించ వచ్చని కలెక్టర్ సూచించారు.

కల్లుగీత కార్మికులకు మద్యం షాపుల డ్రా వాయిదా

ప్రజాశక్తి - గుడివాడ : సోమవారం మచిలీపట్నంలోని కలెక్టర్ కార్యాలయంలో జరగవలసిన కల్లుగీత కార్మికుల మద్యం షాపుల డ్రా వాయిదా పడినట్లు గుడివాడ ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ పి.వెంకటరమణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎలక్షన్ కమిషన్ నుండి అనుమతి లభించిన తరువాత డ్రా తేదీని ప్రకటిస్తామన్నారు. ఉన్నతాధికారులు ప్రకటించే తదుపరి తేదీలను అనుసరించి డ్రా కొనసాగుతుందన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి - గుడివాడ : 1టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో నడుచుకోవాలని లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని 1టౌన్ సి.ఐ శ్రీనివాస్ హెచ్చరించారు. ఆదివారం స్థానిక 1 టౌన్ పోలీసు స్టేషన్లో రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లర్లు, అలజడులకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రౌడీషీటర్లపై పోలీసునిఘా ఎల్లప్పుడు ఉంటు ందన్నారు.

కౌన్సెలింగ్ ఇస్తున్న సిఐ శ్రీనివాస్

రైతులకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య తప్పనిసరి

- జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎన్.పద్మావతి

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : కృష్ణా జిల్లాలో భూమిగల ప్రతి రైతుకు ఒక ప్రత్యేక రైతు గుర్తింపు సంఖ్యను ఇవ్వడం ద్వారా వ్యవసాయ సేవలను సులభతరం చేసి పారదర్శకంగా మరింత అందుబాటులోకి తీసుకురావడం ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం అని జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎన్.పద్మావతి ప్రకటనలో తెలిపారు. ఇది వ్యవసాయ రైతుసంక్షేమం (భారత ప్రభుత్వం) వారి సమన్వయంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ శాఖ చేపడుతున్న బహత్తర కార్యక్రమం అన్నారు.రైతు గుర్తింపు సంఖ్య అనేది రైతు రిజిస్ట్రీ పోర్టల్ నందు నమోదు చేసిన తర్వాత భూమి గల ప్రతి రైతుకు కేటాయింపబడే ప్రత్యేక గుర్తింపు సంఖ్య(11 అంకెల సంఖ్య) ప్రభుత్వ పథకాలు సబ్సిడీలు ఇతర వ్యవసాయ సంబంధిత సేవలు పొందడానికి ఈ సంఖ్య అధికార గుర్తింపుగా పనిచేస్తుందన్నారు. ఈ విశిష్ట సంఖ్య అర్హులైన భూమి గల రైతులను గుర్తించడం లో తోడ్పడి వారికి ప్రభుత్వం నుండి వచ్చు వివిధ రకాల సబ్సిడీలు పంటల భీమా వంటి ప్రయోజనాలు పొందేలా చేస్తుందన్నారు. పథకాలు నిరవధికంగా పొందేందుకు ఆధారిత రైతు పథకాలైన పీఎం కిసాన్ చెల్లింపులు, అన్నదాత సుఖీభవ, పంటల భీమా, పంట రుణాలపై వడ్డీ రాయితీ, సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు తదితర పథకాలు నేరుగా పొందే వీలు కలుగుతుందన్నారు. అలాగే ప్రకతి వైపరీత్యాల వల్ల పంట నష్టం జరిగితే సత్వర పరిహారం అందుతుందన్నారు. అలాగే నీటిపారుదల తెగుళ్ళ నియంత్రణ, వాతావరణ సూచనలు వంటి ఇతర సేవలు అందుకోడానికి తోడ్పడుతుందన్నారు. కాబట్టి మీ ప్రాంతంలోని అన్ని రైతు సేవ కేంద్రాలలో ఈ నమోదు ప్రక్రియ జరుగుతుందన్నారు. ప్రస్తుతం జిల్లా లోని సాగుభూమి గల ప్రతి రైతుకు వర్తిస్తుందన్నారు. జిల్లాలో సుమారు1,52,000 మంది స్వంత భూమి గల రైతులు ఉన్నారాని కాబట్టి రైతులు వారి ఆధార్ నంబర్, ఆధార్ కు లింకు అయిన ఫోన్ నెంబర్, భూ రికార్డులు వివరములు అనగా పట్టాదారు పాసుపుస్తకం తీసుకొని భూమి ఉన్న గ్రామంలోని సంబంధిత రైతుసేవ కేంద్ర సిబ్బందికి అందించాలన్నారు.

నాంచారయ్యకు ఘన నివాళి

ప్రజాశక్తి-చల్లపల్లి : చల్లపల్లి మండలం లక్ష్మీపురం శివారు రామానగరంలో శనివారం మృతి చెందిన పాము నాంచారయ్య అంతిమయాత్ర ఆదివారం నిర్వహించారు. సిపిఎం మండల కమిటీ సభ్యులు లంకపల్లి సత్యనారాయణ నాంచారయ్య మతదేహంపై అరుణ పతాకాన్ని కప్పి వీడ్కోలు పలికారు. అంతిమ యాత్రలో సీనియర్ నాయకులు వాకా రామచంద్రరావు, మండల కార్యదర్శి యద్దనపూడి మధు, కమిటీ సభ్యులు మహమ్మద్ కరీముల్లా, బళ్లా వెంకటేశ్వరరావు, బండారు కోటేశ్వరరావు,,కె. బాబురావు, మేడేపల్లి వెంకటేశ్వరరావు, వెనిగళ్ళ వసంతరావు, కలపాల దావీదు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నాంచారయ్య అంతిమయాత్రలో పాల్గొన్న నాయకులు

ఎన్‌టిఆర్ స్టేడియం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు

ప్రజాశక్తి - గుడివాడ : ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో రూరల్ మండలంలోని బొమ్ములూరు ఆదివారం మణిపాల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ విజయవాడ వైద్య బందంచే మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా వాకర్స్ ఎలెక్ట్ గవర్నర్ లోయ ఈశ్వర వెంకటేశ్వరరావు మాట్లాడుతూ స్త్రీలకు క్యాన్సర్ పరీక్షలు, నోటి క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్ పరీక్షలను డాక్టర్ దివ్య, డాక్టర్ సందీప్, డా॥ఇమ్మానుయేల్, డాక్టర్ అజయ్‌లు నిర్వహించారు. ఈ క్యాంపును 228 మంది వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు కోన రామారావు, పూర్వ గవర్నర్ చంద్రశేఖర్, సభ్యులు దిమ్మిటి శ్రీనివాసరావు, లింగం చిట్టిబాబు, బొప్పన కుటుంబరావు, మాచర్ల రామకష్ణ, గుత్తా శివరామకష్ణ, డి.సురేంద్ర, డిఆర్‌బి ప్రసాద్, నవీన్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

మద్యానికి డబ్బులివ్వలేదని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-గన్నవరం : మద్యానికి బానిసైన భర్త, భార్యను డబ్బులు అడగడంతో ఆమె నిరాకరించడంతో మనస్తాపం చెంది పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం రాత్రి వీరపనేనిగూడెంలో చోటుచేసుకుంది. ఎస్సై చావా సురేష్ కథనం ప్రకారం రానిమేకల వీరబాబు (44) కూలి పనులకు వెళుతుండేవాడు. గత కొన్నాళ్లుగా మద్యానికి బానిసై కుటుంబాన్ని పట్టించుకోవడం మానేశాడు. కూలి పనులకు కూడా వెళ్లకుండా, మద్యానికి డబ్బులు కోసం భార్యను వేధించసాగాడు. బైక్ రిపేర్ చేయించాలనే నెపంతో భార్యను డబ్బులు అడగడంతో ఆమె నిరాకరించింది. దాంతో మనస్తాపం చెందిన వీరబాబు, ఊరి శివారుకు వెళ్లి పొలానికి తెచ్చుకున్న గడ్డి మందు తాగి పడిపోయాడు. అపస్మారక స్థితిలో ఉన్న వీరబాబును దారినపోయేవారు గమనించి అతని భార్యకు సమాచారం ఇవ్వడంతో వెంటనే ఆమె ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందు తున్న వీరబాబు విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో మరణిం చాడు. భార్య ఫిర్యాదుపై అనుమానాస్పద మృతి కింద కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు.

జాతీయ రహదారిపై కారు బీభత్సం

- ఒకరు మృతి

ప్రజాశక్తి-గూడూరు : మచిలీపట్నం విజయవాడ జాతీయ రహదారి సమీపంలోని కోకనారాయణపాలెం పరిధిలో రామరాజుపాలెం అడ్డరోడ్డు వద్ద ఆదివారం ఘోర ప్రమాదం జరిగింది. ఘటనా స్థలంలో ఒకరు మతి చెందగా మృతి చెందిన వ్యక్తి మల్లవోలుకు చెందిన విన్నకోట సాంబశివరావుగా గూడూరు పోలీసులు గుర్తించారు. మచిలీపట్నానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త కి చెందిన వాహనం అతివేగంతో పలు వాహనాలను ఢీకొన్న ఈ ప్రమాదంతో రహదారి రక్తసిక్తమైంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ ఐ సత్యనారాయణ తెలిపారు.

పూజారి మెడలో గొలుసు చోరీ

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : పూజారి మెడలో బంగారు గొలుసును దొంగ భక్తుడు అపహరించిన సంఘటన జిల్లా కేంద్రమైన మచిలీ పట్నంలో ఆదివారం చోటుచేసుకుంది. ఇనగుదురు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మచిలీపట్నం గొడుగు పేట లోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రధాన అర్చకునిగా పనిచేస్తున్న పూజారి ముత్తెవి లీలా లక్ష్మీపతి ఆచార్యులు రోజూ వారి మాదిరిగా ఆదివారం ఉదయం స్వామివారికి పూజ చేస్తుండగా ఆలయంలోకి ఇరువురు గుర్తు తెలియని దుండగులు ప్రవేశించి ఆలయం బయటికి వచ్చి ఆశీర్వదించాలని పూజారిని కోరారు. వారు అడిగిన మేరకు ఆలయం గోపురం వద్దకు వచ్చి వారిరువురును పూజారి ఆశీర్వదించినట్లు తెలిపారు. ఆశీర్వచనం అందించిన అనంతరం పూజారి మెడలోని బంగారు గొలుసును తాకుతానంటూ కోరినట్లు పూజారుల ఒంటిపై బంగారాన్ని తాకితే తమకు కలిసొస్తుందని పూజారిని నమ్మించడంతో దీనికి ఒప్పుకున్న పూజారి మెడలోని బంగారపు గొలుసును తీసి ఆ వ్యక్తులకు అందించినట్లు అనంతరం గొలుసు కళ్ళకు అద్దుకొని అక్కడి నుండి ఆ ఇరువురు బైక్ పై పరారైనట్లు తెలిపారు. బాధితుని పిర్యాదు ఇనకుదురుపేట పోలీసులు ఆలయం వద్దకు చేరుకుని. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పూజరి నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

వేర్వేరు ప్రమాదాల్లో పలువురికి గాయాలు

ప్రజాశక్తి-మోపిదేవి : మోపిదేవి శివారు ఎస్ విహార్ వద్ద జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న కారుని వెనుక వస్తున్న మరో కారు ఢీకొన్న సంఘటనలో పలువురికి స్వల్ప గాయాలు అయ్యాయి. బైకిస్టు అడ్డురావడంతో తప్పించబోయి ముందు వెళ్తున్న కారు బ్రేక్ వేయగా వెనక వస్తున్న మరో కారు ఢీ కొట్టినట్లు సమాచారం. కారులో పసిపిల్లలు కూడా ఉండగా ఎటువంటి ప్రమాదం లేదని తెలిసింది. అలాగే మోపిదేవి వార్పు వద్ద ఆటో ప్రమాదంలో ఓ వ్యక్తికి కాలు విరిగినట్లు సమాచారం. క్షతగాత్రులను చికిత్స కోసం అవనిగడ్డ ప్రభుత్వ వైద్యశాల కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆప్యాయంగా పలకరించుకుంటున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలో ఉక్కు కళా క్షేత్రంలో 1974-1975 సంవత్సరంలో గెంటేల వెంకటజోగయ్య ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్ఎస్‌సి చదువు పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు యాభై సంవత్సరాలు స్వర్ణోత్సవం పూర్తి చేసుకున్న సందర్భంగా కుటుంబ సమేతంగా ఆత్మీయ సమ్మేళనం వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలలో రెండు తెలుగు రాష్ట్రాలు, ఇతర దేశాల్లో నివసిస్తున్న పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. 1974-1975 సంవత్సరంలో 130 మంది చదువుకున్నారని, వీరిలో సుమారు 27 మంది మరణించారని స్వర్ణోత్సవ పూర్వ విద్యార్థులు తెలిపారు. మిగిలిన వారందరు దేశ, విదేశాలల్లో ఉన్న పూర్వ విద్యార్థులు వారి కుటుంబ సభ్యులతో పాల్గొన్నారు. ఆప్యాయంగా పలకరించుకున్నారు. సహపంక్తి విందు చేశారు. అనంతరం సర్టిఫికెట్లు, వెమెంటోలను అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల స్థల దాత గెంటేల వెంకటజోగయ్య ముని మనవడు గెంటేల విద్యాసాగర్, రిటైర్డ్ యంఇఒ వెంకటేశ్వర శర్మ, ప్రస్తుత హెచ్.ఎం మాధవీలత, పెనుగంచిప్రోలు జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వీరవల్లి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ ఎస్ఎస్‌సి చదువుకుని యాభై సంవత్సరాలు పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నందుగా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమాని పసుపుల పుల్లారావు, శిరిశెట్టి కాంతారావు, మొరిశెట్టి రంగారావు, వీరవల్లి శ్రీనివాసరావులు నిర్వహించడానికి పూనుకున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి మొరిశెట్టి రామనాథం (యు.యస్), శారదా, పాకలపాటి శ్యామలా, పైడిమర్రి రూపవతి తదితరులు సహకరించారని పూర్వ విద్యార్థులు తెలిపారు.

అనాథలను ఆదరించడం అందరి బాధ్యత

ప్రజాశక్తి - తిరువూరు : శారీరక వైకల్యంతో బ్రతుకు భారమై అనాథ శరణాలయాల్లో ఆశ్రయం పొందుతున్న అనాథలను ఆదరించడం అందరి బాధ్యతని రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ వాసం మునియ్య అన్నారు. తిరువూరు భగవాన్ శ్రీరమణ మహర్షి అంధుల, వికలాంగుల ఆశ్రమంలో అనాథలకు అన్నదానం చేశారు. ఏ.కొండూరు మండలం గొల్ల మందల రేషన్ డీలర్ మలమంటి భూషణం గాంధీ కుమారుడు సాయికృష్ణకు అమెరికాలో ఉద్యోగం వచ్చిన సందర్భంగా అన్న ప్రసాదం వితరణ చేసినట్లు స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకుడు వెంపాటి అబ్రహం తెలిపారు. ఉన్నత స్థాయి ఎదిగిన ప్రతి ఒక్కరూ అనాథలను ఆదుకోవాలని కోరారు.

సుబ్రహ్మణ్యేశ్వరుని కళ్యాణం

ప్రజాశక్తి - గంపలగూడెం : తోటమూలలోని శ్రీ వల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి 25వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీ స్వామివారి కళ్యాణ మహోత్సవం ఘనంగా జరిగినట్లు ఆలయ పురోహితులు కేతముక్కల అజయ్ శాస్త్రి తెలిపారు. ఈ కళ్యాణంలో 75 మంది దంపతులు పీటలపై కూర్చొని కన్యాదానం చేసినట్లు వివరించారు. అనంతరం మహా అన్నదానం జరిగింది.

శ్యామలాంబ సహిత రామలింగేశ్వర కళ్యాణం

ప్రజాశక్తి-నందిగామ : నందిగామ శ్రీ శుక శ్యామలాంబ సహిత రామలింగేశ్వర స్వామి దివ్య కళ్యాణ మహోత్సవం ఉత్సవాలు ఆదివారం జరిగాయి. ఆదివారం ఆలయ ఇఒ గంగాధర్ ఆలయ అనువంశిక ధర్మకర్త వాసిరెడ్డి మురళి రాఘవ కుమార్ పర్యవేక్షణలో రామలింగేశ్వర స్వామికి ఆలయ స్థానాచార్యులు ముదిగొండ శౌనక ఆరాధ్య, ఆలయ పురోహితులు సన్నిధానం కిషోర్ శర్మ ఆలయ ఉప ప్రధాన అర్చకులు దండిభట్ల బాలకృష్ణ శాస్త్రి ముఖ్య అర్చకులు యడవల్లి సీతారామకృష్ణ ప్రసాద్ సత్య కృష్ణ పవన్ కుమార్ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ప్రణవం నృత్య ప్రణతి శిక్ష బృందం చేకూచిపూడి జానపద నృత్య ప్రదర్శన అందర్నీ ఆకట్టుకుంది.

రైతు అనుమానాస్పద మృతి

మృతిచెందిన రైతు శ్రీనివాసరావు (ఇన్‌సెట్‌లో) ఫైల్ ఫొటో

ప్రజాశక్తి - మైలవరం : ఓ రైతు అనుమానాస్పద రీతిలో మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి మైలవరం మండలం మరుసుమల్లి గ్రామ శివారు ములకల పెంటలో జరిగింది. ఈ మేరకు మైలవరం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయింది. మృతుని బంధువులు తెలిపిన వివరాల ప్రకారం ములకల పెంట గ్రామానికి చెందిన కడియం శ్రీనివాసరావు (57) వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తూ ఉన్నాడు. శ్రీనివాసరావుకు భార్య ఒక కుమారుడు కుమార్తె ఉన్నారు. శ్రీనివాసరావుకు ములకలపెంట గ్రామ పరిధిలో ఆర్ఎస్ నెంబర్.42-1 ఎల్‌లో 3 ఎకరాల 21 సెంట్లు మెట్ట భూమి ఉంది. ఈ భూమికి పక్కనే మరుసుమల్లి గ్రామానికి చెందిన సుబ్బారావు అనేక రైతు భూమి ఉంది. అయితే గత ప్రభుత్వ హయాంలో ములకల పెంటలో భూములను రీ సర్వే చేశారు. ఈ సందర్భంలో రెవెన్యూ అధికారులు రీ సర్వే చేసి శ్రీనివాసరావుకు, సుబ్బారావుకు చెందిన భూమిలో 46 సెంట్లు భూమి ఉందని హద్దులుగా రాళ్లు పాతారు. సరిహద్దు రాళ్లను సుబ్బారావు తొలగించాడని బాధితులు తెలిపారు. అప్పటినుంచి శ్రీనివాసరావుకు సుబ్బారావుకు భూమి విషయమై గొడవలు జరుగుతూనే ఉన్నాయి. ఇటీవల శ్రీనివాసరావు మామిడి చెట్లకు మందు కొడుతుండగా సుబ్బారావు అడ్డుకున్నాడు. శనివారం పొలానికి వెళ్లిన శ్రీనివాసరావు సాయంత్రం అయినా ఇంటికి తిరిగి రాకపోవడంతో బంధువులు పొలం వద్దకు వెళ్లి చూడగా శ్రీనివాసరావు శవమై కనిపించడంతో ఇది ముమ్మాటికి సుబ్బారావు చేయించిన హత్య అని మృతుని బంధువులు ఆరోపిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థానానికి వెళ్లి పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మైలవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆదివారం విజయవాడ నుంచి డాగ్స్క్వాడ్, క్లూస్ టీం వచ్చి పరిశీలించారు. మృతుని బంధువులు మైలవరం ప్రభుత్వాసుపత్రి వద్దకు చేరుకున్నారు. శ్రీనివాస రావు కుమారుడు కడియం పుల్లారావు సుబ్బారావు అతని అనుచరులు కలిసి గొడ్డలితో తన తండ్రిని చంపారని ఆరోపిస్తున్నాడు. ఈ మేరకు మైలవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనలో ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారని విశ్వసనీయ సమాచారం. ఎస్ఐ సుధాకర్‌ను వివరణ కోరగా అలాంటిదేమీ లేదని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె.సుధాకర్ తెలిపారు.

పిల్లల సంపూర్ణ ఆరోగ్యానికి 'ఆల్బెండజోల్'

నేడు నులిపురుగుల నిర్మూలన దినోత్సవం

ప్రజాశక్తి - తిరువూరు : ఆరోగ్యవంతమైన పిల్లల కోసం నులిపురుగుల నిర్మూలన 'ఆల్బెండజోల్' టాబ్లెట్స్ వేయాలని వైద్యాధికారి డాక్టర్ రేష్మా బేగం అన్నారు. తిరువూరు అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో ఆది వారం జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమ వివరాలను ఆమె వెల్లడించారు. ఈ సందర్భంగా రేష్మా బేగం మాట్లాడుతూ పిల్లలు కిషోర్ బాలల కడుపులో నులిపురుగులు ఉంటే పోషకాహార లోపం, రక్తహీనత ఏర్పడుతుందన్నారు. శారీరక, మానసిక ఎదుగుదల లోపాలను కూడా కలిగి ఉంటారని తెలిపారు. దీనివల్ల పిల్లలు నీరసంగా ఉండడంతో పాటు చదువుపైనే కాకుండా ఏ పనైనా ఏకాగ్రత కోల్పోతారని వైద్యాధికారి పేర్కొన్నారు. ఈ నెల 10 సోమవారం వైద్య ఆరోగ్య సిబ్బంది అన్ని అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లో ఉచితంగా ఇస్తున్న ఆల్బెండజోల్ 400 మిల్లీ గ్రాముల మాత్ర ద్వారా నులిపురుగుల సంక్రమణం సులభంగా నిర్మూలించవచ్చని రేష్మా బేగం తెలిపారు. 1 నుంచి 19 సంవత్సరాల్లోపు పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేసి పిల్లల శారీరక మానసిక వికాసానికి తోడ్పడాలని ఆమె కోరారు. హెల్త్ సూపర్వైజర్ కె.రవి, హెల్త్ డిజిటల్ ఎస్‌కె ఆషాబీ పాల్గొన్నారు.

ఫ్రిడ్జ్ టెక్నీషియన్స్ సేవలు అభినందనీయం: ఎమ్మెల్యే బొండా

వార్షికోత్సవ కార్యక్రమం ప్రారంభిస్తున్న బొండా, తదితరులు

ప్రజాశక్తి - విజయవాడ : సెంట్రల్ నియోజకవర్గంలోని సింగ్‌నగర్‌లోని ఆహ్వాన్ కన్వెన్షన్ హాల్లో జరిగిన విజయవాడ ఏసీ, ఫ్రిడ్జ్ టెక్నీషియన్ అసోసియేషన్ వారి ఏడవ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా ఆదివారం మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు పాల్గొని సభ్యులకు శుభాకాంక్షలు తెలిపి మాట్లాడారు. ఈ కాలంలో ఎయిర్ కండిషనర్ వినియోగాలు చాలా పెరిగిపోయాయని, గతంలో విండో ఎసి మాత్రమే అందుబాటులో ఉండేదని నేడు స్ప్లిట్ ఎయిర్ కండిషనర్, సెంట్రల్ ఎయిర్ కండిషనర్లు అధికం అయిపోయాయని అన్నారు. ఈ రోజుల్లో ప్రతి సామాన్యుడికి అందుబాటులో ఎయిర్ కండిషనర్లు ఉంటున్నాయని, అటువంటి ఎయిర్ కండీషనర్స్ టెక్నీషియన్స్ ప్రజల నిత్యజీవితంలో ఒక భాగమై పోయారని అన్నారు. వీరి సేవలను అభినందించి భవిష్యత్తులో వీరికి ఎటువంటి సహకారం కావాలన్నా తాను ముందుంటానని అన్నారు. అసోసియేషన్ సభ్యులకు మెడికల్ క్యాంపులు నిర్వహించి ఉచితంగా మందులు అందించడం చాలా సంతోషించదగ్గ అంశం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎయిర్ కండిషనర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

దేవస్థానంలో బహిరంగ వేలం

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ మండలం అంబారు పేట గ్రామంలో శ్రీ సత్యమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఈనెల 13 తేదీ గురువారం ఉదయం 11 గంటలకు టెండర్ కం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో గెల్లి హరి గోపీనాథ్ బాబు ఆదివారం తెలిపారు. అమ్మవారి ఫోటో ఫ్రేమ్స్ స్టిక్కర్లు, వగైరా అమ్ముకునే హక్కుకు, భక్తులు పొంగల్ చేసుకుని పెట్టు కు టెండర్ కం బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు చెప్పారు. దేవాదాయ శాఖ నిబంధనలకు అనుగుణంగా జరిగే ఈ బహిరంగ వేలంలో ఆసక్తి గలవారు పాల్గొనాలని కోరారు.

శ్రీరామ కోటి మహోత్సవ కరపత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో 72వ శ్రీరామ కోటి మహోత్సవాల ఆహ్వానాలను స్వామి వద్ద పూజ అనంతరం ఆహ్వాన కరపత్రికలను సీతారామ నామ సంకీర్తన సంఘ సభ్యులు ఆవిష్కరించారు. మార్చి 6 తేదీ నుండి ఆరు రోజులు పాటు జరిగే రామకోటి మహోత్సవాల్లో ప్రతిరోజు పలు దేవతామూర్తుల దివ్య కళ్యాణం, ధార్మిక ఆధ్యాత్మిక హరికథా సంస్కృతిక కార్యక్రమాలతో శ్రీ రామకోటి మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు సీతారామనామ సంకీర్తన సంఘ అధ్యక్షుడు దుడ్డు నాగేశ్వరావు తెలిపారు.

ఉద్యోగోన్నతి పొందిన కృష్ణారెడ్డికి వీడ్కోలు

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు పోలీస్ స్టేషన్‌లో ఎఎస్ఐగా పని చేస్తూ ఇటీవల ఎస్ఐగా ఉద్యోగోన్నతి పొందిన కృష్ణారెడ్డికి ఎస్ఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో సిబ్బంది శనివారం రాత్రి ఘన సన్మానం చేసి వీడ్కోలు పలికారు. గత కొన్నేళ్లుగా తిరువూరు ఎఎస్ఐ విశేష సేవలు అందించిన కృష్ణారెడ్డి భవిష్యత్తులో విధి నిర్వహణలో ఉత్తమ సేవలం దించాలని ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ లక్ష్మీ సిబ్బంది పాల్గొన్నారు. తిరువూరు పోలీస్ స్టేషన్ నుంచి రిలీవ్ అయిన నేను విజయవాడ పోలీస్ కమిషనర్‌కు రిపోర్ట్ చేశానని, పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్నట్లు కృష్ణారెడ్డి తెలిపారు.

శామ్‌సంగ్ కొత్త రికార్డు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : శామ్‌సంగ్ ఫ్లాగ్‌షిప్ స్టోర్ కొత్త గ్యాలక్సీ ఎస్25 సిరీస్ విజయాన్ని ప్రత్యేక కార్యక్రమంతో జరుపుకుందని సంస్థ ప్రతినిధి ఎం.అనిల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో డివైజుల ముందస్తు పంపిణీని ప్రారంభించి, ఇక్కడ 700 మందికి పైగా వినియోగదారులకు ఫోన్లు అందజేసినట్లు తెలిపారు. ఈ రికార్డ్ డెలివరీ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న స్మార్ట్‌ఫోన్ సిరీస్ ప్రీ-ఆర్డర్ల కోసం విపరీతమైన ప్రతిస్పందనను అనుసరిస్తూ, అత్యంత ఆకట్టుకునే అంశంగా నిలిచిందని అన్నారు. బికెసి స్టోర్ ప్రత్యేకంగా క్యూరేట్ చేసిన అనుభవాలు, నిజ జీవిత దృశ్యాల ద్వారా శామ్‌సంగ్ అత్యుత్తమ ప్రీమియం ఉత్పత్తులను ప్రదర్శిస్తుందన్నారు. గ్యాలక్సీ ఎస్25 సిరీస్ డివైజులు శామ్‌సంగ్ అత్యంత ఆధునిక ఫ్లాగ్‌షిప్ స్మార్ట్‌ఫోన్లు. ఇవి ఇప్పటి వరకు ఏ బ్రూ ఏఐ కంపానియన్‌గా రూపొందించబడ్డాయని తెలిపారు.

వైద్యం నిమిత్తం ఆర్థిక సాయం

ప్రజాశక్తి - మైలవరం : మైలవరం ఆదాంపురానికి చెందిన బూరగ రత్తయ్య కు వైద్య పరీక్షలు నిమిత్తం ఆదాంపురం సంఘ సభ్యులు రూ.10వేలు ఆర్థికసాయాన్ని ఆదివారం సాయంత్రం అందజేశారు. రత్తయ్య కేన్సర్‌తో బాధపడుతూ సరిగ్గా పనిచేసుకోలేని నిస్సహాయ స్థితిలో ఇటు కుటుంబ పోషణకు, వైద్య ఖర్చులు నిమిత్తం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు. విషయం తెలుసుకున్న సంఘ పెద్దలు రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు... వరకాల ఏసుపాదం, కొడిరెక్కల రవికుమార్, వాడపల్లి వసంతరావు,జాన్ మాస్టర్,బొడ్డు విజయ్ బాబు, బండ్లమూడి శ్యామ్ ఆర్థిక సాయాన్ని అందజేసిన వారిలో ఉన్నారు.

పలువురు టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-కంకిపాడు : కంకిపాడు ఉప సర్పంచ్ రాచూరి చిరంజీవి సారథ్యంలో సర్పంచ్ బాకీ రమణ,వార్డు మెంబర్లు, ఎంపీటీసీ సభ్యులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి స్థానిక ఎమ్మెల్యే బోడే ప్రసాద్ పసుపు కండువాను వేసి పార్టీ లోకి ఆహ్వానించారు. కంకిపాడు నుంచి అనుచరులతో ర్యాలీగా వచ్చిన చిరంజీవి అధికార పార్టీలో చేరారు.

విద్యుత్ మోటార్లకు కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవాలి

ప్రజాశక్తి-ఉయ్యూరు : విద్యుత్ వినియోగదారులు వారి మోటర్ల సామర్థ్యానికి తగిన కెపాసిటర్లు ఏర్పాటుచే సుకోవాలని ఏపీసీపీడీసీఎల్ ఉయ్యూరు డివిజన్ ఈఈ డి కష్ణనాయక్ తెలిపారు. ఉయ్యూరు డివిజన్ సబ్డివిజన్ పరిధిలో కేటగిరి 2, 3, 4 సర్వీసులకు నూతన వి ద్యుత్ మీటర్ల ఏర్పాటు చేస్తున్నామని, వినియోగదారులు వారి మోటరు లోడుకు అను గుణంగా కెపాసిటర్లు ఏర్పాటుచేసుకోవాలని, లేని పక్షంలో కేవీఏహెచ్ బిల్లింగ్ ఎక్కువ వస్తుందన్నారు. విద్యుతాశాఖ సూచనలు అనుసరించి వినియోగదారు లు సహకరిం చాలని పేర్కొన్నారు.



సాయం అందిస్తున్న దృశ్యం

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-చల్లపల్లి : చల్లపల్లి మండల పరిధిలోని పురిటిగడ్డ చేనేత కాలనీకి చెందిన తిరువీధుల పరశురామ్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడు తున్నాడు. ఆదివారం రావెళ్ళ ఫౌండేషన్ అధినేత ఉదయ్ కుమార్ పరశురామ్ ని పరామర్శించి, వైద్య ఖర్చుల కోసం రూ.పది వేలు ఆర్థిక సహాయం అందచేశారు. కార్యక్రమంలో డీసీ చైర్మన్ నిడమానూరి దిలీప్ కుమార్, ఎంపీటీసీ రాజులపాటి అంకమ్మ, మాజీ ఎంపీటీసీ దేవభక్తుని గోపాలకష్ణ, మాజీ సర్పంచ్ పరుచూరి సురేష్, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షులు మోర్ల శివ, టీడీపీ గ్రామ అధ్యక్షుడు కైతేపల్లి శ్రీనుబాబు పాల్గొన్నారు.

రైతుల పండుగలో భాగస్వాములు కావాలి

మాజీ అధ్యక్షులను సన్మానిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-గన్నవరం : కృష్ణా మిల్క్ యూనియన్ 60 వసంతాలు పూర్తి చేసుకున్న శుభ తరుణంలో జరుగుతున్న రైతుల పండుగలో అందరూ భాగస్వాములు కావాలని యూనియన్ జిల్లా డైరెక్టర్, గన్నవరం పాల కేంద్రం అధ్యక్షుడు పాలడుగు వెంకట రామ వరప్రసాద్ (నాని)అన్నారు. ఆదివారం రాత్రి పాత గన్నవరంలోని పాలకేంద్రం ఆవరణలో రైతుల పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. నాని ఆధ్వర్యంలో గతంలో పాల కేంద్రం అధ్యక్షులు గా పనిచేసిన వారిని ఘనంగా సన్మానించారు. 60 మంది పాడి రైతులకు వెండి గిన్నెలు బహుకరించారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ కాకాని వెంకటరత్నం తో మొదలై ఎందరో మహాను భావులు చేసిన కృషి ఫలితంగా కష్ణా మిల్క్ యూనియన్ విజయ పరంపర కొనసాగుతుందన్నారు. ఇటువంటి గొప్ప యూనియన్‌లో తాను పనిచేయడం ఎంతో అదష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. రూ. 1200 కోట్ల టర్నోవర్తో రైతుల సేవలు ముందుకు సాగుతుందని, ఇటువంటి యూనియన్ రాష్ట్రంలో ఉండడం పాడి రైతుల అదష్టంగా చెప్పాలన్నారు. నాటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు, నేటి ముఖ్యమంత్రి చంద్రబాబు, దివంగత చైర్మన్ మండవ జానకరామయ్య చేసిన కషిని, అందించిన సహకారాన్ని పాడి రైతులు ఎప్పుడూ గుర్తుపెట్టుకోవాలని చెప్పారు. 20 సంవత్సరాలుగా గన్నవరం పాలకేంద్రం అధ్యక్షులుగా పనిచేసి సంఘాన్ని లాభాల బాట పట్టించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గన్నవరం వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్, మాజీ కోపరేటివ్ బ్యాంక్ అధ్యక్షులు కాసరనేని రంగబాబు,విజయ డైరీ పి అండ్ ఐ ఏజీఎం అన్వేష్, గన్నవరం రూట్ మేనేజర్ తుమ్మల యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

కొండాలమ్మను దర్శించుకున్న జిల్లా జడ్జి

జడ్జికి చిత్రపటం బహూకరిస్తున్న ఈవో

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని వేమవరం గ్రామంలో ఉన్న కొండలమ్మ అమ్మవారిని సుమారు 22 వేల మంది యాత్రికులు ఆదివారం దర్శించుకున్నారు. అత్యధిక స్థాయిలో భక్తులు అమ్మవారికి పాలపొంగళ్ళు సమర్పించి, వారి మొక్కుబడులు తీర్చుకున్నట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి ఆకుల కొండలరావు తెలిపారు. అమ్మవారి దేవస్థానమునకు విచ్చేసిన భక్తులకు తాగు నీరు, శానిటేషన్ ఏర్పాట్లు, ఏ విధమైన అసౌకర్యములు కలగకుండా దర్శనం చేసుకొను టకు ఇట ఏర్పాట్లు పర్యవేక్షించారు. అలాగే కష్ణాజిల్లా జడ్జ్ అరుణ సారిక కొండాలమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. వారిని దేవస్థానం సిబ్బంది, అర్చక స్వాములు స్వాగతం పలికి అమ్మవారి కి విశేషమైన పూజలు చేయించి శాలువాతో సత్కరించి వారికి శ్రీ అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాలు అందజేశారు.

హంసలదీవికి పోటెత్తిన యాత్రికులు

ప్రజాశక్తి-కోడూరు : హంసలదీవి బీచ్ వద్దకు ఆదివారం పర్యటకులు దూర ప్రాంతాల నుంచి ప్రత్యేక వాహనాల ద్వారా పెద్ద సంఖ్యలో కుటుంబ సభ్యులతో విచ్చేశారు. పాలకాయతిప్పా కరకట్ట వద్ద సాగర తీరాన మద్యం, గుట్కా, సిగరెట్ లాంటి ప్రజలకు పర్యావర ణానికి హానికరంగా ఉన్న ఇలాంటి వాటిని బీచ్ పరిసర ప్రాంతాలకు తీసుకు వెళ్ళకుండా లోపలికి వెళ్లే ప్రతి వాహనాన్ని తనిఖీ చేశారు. పాలకాయతిప్ప మెరైన్ సీఐ సురేష్‌రెడ్డి బీచ్ పరిసర ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా, పర్యటకులు ప్రమాదాల బారిన పడకుండా మెరైన్ సిబ్బందితో తగు జాగ్రత్తలు తీసుకున్నారు. పర్యాటకులకు స్నానాలు చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించి అవగాహన కల్పించారు. తీరం వెంబడి పాలకాయతిప్ప మెరైన్ పోలీసులు, కోడూరు పోలీసులు, లైఫ్ బాయ్స్ లైఫ్ జాకెట్లతో గస్తీ నిర్వహించారు.

'విశ్వభారతి'లో ఘనంగా క్రీడా దినోత్సవం

క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - గుడివాడ : విశ్వభారతి వైస్ వుడ్ స్కూల్లో ఆదివారం క్రీడా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రిటైర్డ్ చీఫ్ ప్రిన్సిపల్ కమిషనర్ అజయ్‌కుమార్ పాల్గొని విద్యార్థుల నుండి గౌరవ వందనం స్వీకరించి, క్రీడాజ్యో తిని వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాలమైన క్రీడా ప్రాంగణంలోని వసతులను విద్యార్థులు వినియోగించుకో వాలన్నారు. చదువుతోపాటు శారీరక దారుఢ్యం కూడా విద్యార్థులకు అవసరమన్నారు. విశ్వభారతి విద్యాసంస్థల చైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణ మాట్లాడుతూ విద్య మనిషికి ఎంత అవసరమో క్రమశిక్షణ కూడా అంతే అవసరమని, ఆటలు ఆడడం ద్వారా దీన్ని అలవాటు చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టు కున్నాయి. అనంతరం డైరెక్టర్ ఆర్.మంజుల, ఆర్.ప్రణీత్, కీర్తిలు విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైజ్ వుడ్ డీన్ చంద్రశేఖర్, ప్రిన్సిపల్ సునీత, సీఈవో కష్ణారెడ్డి, ప్లస్‌వన్ ప్లస్ టు ఇంచార్జ్ హరిబాబు, వైస్ ప్రిన్సిపాల్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక క్యాంపు ద్వారా ఉపాధ్యాయులకు సేవలు : యుటిఎఫ్

ప్రజాశక్తి-కంకిపాడు : యుటిఎఫ్ కంకిపాడు ఆధ్వర్యంలో మండలంలోని ప్రాథమిక, ప్రాథమికో న్నత, ఉన్నత పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు ఇన్కమ్ టాక్స్ స్టేట్మెంట్లు, ఫామ్ 16లను ఇప్పటివరకు దాదాపు 198 మందికి అందించామని అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బుచ్చయ్య బాబు శ్రీనివాసరావులు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం వారు మాట్లాడుతూ అందరికి ఉచితంగా ప్రతీ సంవత్సరం మాదిరిగానే పిడిఎఫ్, ఒక సెట్ లేదా మూడేసి కాపీల సెట్లు యుటిఎఫ్ కంకిపాడు మండలశాఖ ఉచితంగా అందించా మన్నారు. ఈ అవకాశాన్ని ఇంకా మిగిలిన వారు కూడా సద్విని యోగం చేసుకోవాలని వారు కోరారు. ఐటీ సేవలు అందించిన కార్యదర్శులు మురళి, ఫణింద్ర కుమార్ వినయ్ కుమార్, మూర్తి, అంబూజీ, సురేష్, గోపాల్,ఎల్‌వీ.ఆర్, జోగిరాజులను వారు అభినందించారు.

నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో బంగారు పతకాలు

ప్రజాశక్తి-చల్లపల్లి : నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్ పోటీలలో మూడు గోల్డ్ మెడల్స్ సాధించినట్లు మొవ్వ మండలం పెదపూడి ఎంపీ యూపీ పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడుగా పని చేస్తున్న ఎస్.ఎస్ సాంబశివరావు ఆదివారం తెలిపారు. ఈ నెల6,7,8 తేదీలలో రాజు రిషి కాలేజీ, అల్వార్, రాజస్థాన్ లో జరిగిన నేషనల్ మాస్టర్ అథ్లెటిక్ ఛాంపియన్షిప్ పోటీలలో 4/100 మీటర్ల రన్నింగ్ రేసులో గోల్డ్ మెడల్, 4/400 మీటర్ల రన్నింగ్ రేస్ లో గోల్డ్ మెడల్, 400 మీటర్ల హార్టిల్స్‌లో గోల్డ్ మెడల్ సాధించినట్లు తెలిపారు. చదువుతో పాటు క్రీడల పై మక్కువతో సాధన చేసి మెడల్స్ సాధించటం సంతోషంగా ఉందన్నారు. తన విజయానికి ఉప్పల స్వామి, నాగుల్ సలహా లు, సూచనలు పిడి భాస్కర్ తోడ్పాటు ఉపయోగపడిందన్నారు.

హాస్యానందంగా ముగిసిన నాటిక పోటీలు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : మనసుకు ఉల్లాస, ఉత్తేజాలను కలిగిస్తూ మూడు రోజులుగా జరుగుతున్న హాస్య నాటికల పోటీలు హాస్యానందంగా ముగిసాయి. సుమధుర కళా నికేతన్ 51వ వార్షికోత్సవం మరియు 27వ తెలుగు హాస్య నాటికల పోటీల్లో భాగంగా మూడవరోజు కార్యక్రమం ఆదివారం సిద్దార్థ కళా పీఠం సౌజన్యంతో సిద్దార్థ కళాశాల ఆడిటోరియం లో జరిగాయి. ఉదయం పది గంటలకు యువతలో నిద్రాణమై ఉన్న ప్రతిభను వెలుగులోకి తెస్తూ పలు ప్రదర్శనలు జరిగాయి. నాట్యరంగంలో విశేష ప్రతిభ కల లేఖ్యభరణి, సాయి వర్షిత వర్మ, శతి సమన్వి, అజయ్ బందం తమ నాట్యతరంగాలతో అలరించగా, గుడిపాటి శ్రీలలిత, భమిడిపాటి రాజశేఖర్, రసూల్ బాబు, సాత్విక శ్రీజ, ప్రణీత లు పాడుతా తీయగా అంటూ తమ మధుర గానాన్ని వినిపించారు, చిరు ప్రాయం లోనే అద్భుత వాద్య విన్యాసం చేసిన చెర్రీ, పిండిప్రోలు కష్ణ కుమారి బందం వ్యాద్య గోష్టి ఉల్లాసాన్ని కలిగించాయి. సాయంత్రం పోటీలలో భాగంగా యంగ్ థియేటర్ ఆర్గనైజేషన్, విజయవాడ వారిచే లిప్రేమ పిచ్చిలి గోపీ వల్లభ నాటికను వాసుదేవరావు దర్శకత్వంలో నవ్వుల పువ్వులు పూయించారు. చివరిగా మల్లాది క్రియేషన్స్, హైదరాబాదు వారు మల్లాది రవికిరణ్ రచనను, మంజునాథ్ దర్శకత్వంలో లిఆవేశంలో ఆనందంలి నాటిక ప్రదర్శించి నవ్వించారు. యువ కళాకారులను ప్రోత్సహిస్తూ పి బి సిద్దార్థ కళాశాల విద్యార్థులచే లికదం కదం పర్‌లి నాటికను పిన్నమనేని మత్యుంజయ రావు రచనను, వాసు దర్శకత్వం లో ప్రదర్శించారు. అనంతరం జరిగిన సభలో సుమధుర ఆత్మీయులు లిహాస్యబ్రహ్మలి జంధ్యాల స్మారక పురస్కారాన్ని, సినీ, రంగస్థల నటులు సుబ్బరాయ శర్మ కు బహుకరించి సత్కారం చేసారు. మూడు రోజుల హాస్య నాటికల పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం చేసారు. ఈ సందర్భంగా జరిగిన సభలో అవనిగడ్డ శాసన సభ్యులు మండలి బుద్ధప్రసాద్, లలిత ప్రసాద్(సిద్దార్థ కళా పీఠం), దారా సత్యనారాయణ శర్మ, డి రామకోటేశ్వరరావు, పిన్నమనేని మురళీకష్ణ (జాషువా సాంస్కృతిక వేదిక), కోనేటి సుబ్బరాజు, దొంతిరెడ్డి వేమారెడ్డి, రావి వెంకట రావు(చైర్మన్, ఎన్ఆర్ఐ), సంస్థ భాధ్యులు యం సి దాస్, సామంతపూడి నరసరాజు, డాక్టర్ ఎన్ మురళీకష్ణ, పసుమర్తి భాస్కరశర్మ, పిఎస్ఎన్ మూర్తి, ఢాక్టర్ డి కైలాసరావు, పసుమర్తి శివరాం, దర్భా ఫణీంధ్ర పాల్గొన్నారు.

కళ్యాణ మహోత్సవ ఏర్పాట్లు పరిశీలన

ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్ఐ అర్జున్

ప్రజాశక్తి - వత్సవాయి : ఎంతో ప్రతిష్టాత్మకంగా జరుగు తున్న తిరుపతమ్మ అమ్మవారి కళ్యాణ మహోత్సవంలో తనదైన శైలిలో పనులను ఎప్పటి కప్పుడు పరిశీలిస్తూ యాత్రి కులకు ఎటువంటి ఇబ్బందులు ఎదురవకుండా ఉండేందుకు పెనుగంచిప్రోలు ఎస్ఐ అర్జున్ తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ నెల 11 నుంచి 15వ తేదీ వరకు జరిగే కళ్యాణ మహోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండాలంటే ముందుగా పటిష్టంగా, చాలా భద్రతగా ఉండాలి. దీనికి పోలీసు వారి అవసరం ఎంతో ఉంది. అవసరాలకు తగ్గట్టే ఏర్పాట్లు పర్యవేక్షించే పనిలో ఎస్ఐ ఉన్నారు. ఎప్పటికప్పుడు తన కింది స్థాయి ఉద్యోగులతో కో ఆర్డినేట్ చేసుకుంటూ యాత్రికులకు ఇబ్బందులు లేకుండా చూసుకుంటామని ఎస్ఐ అర్జున్ తెలిపారు.

పిఆర్‌టియు ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - మైలవరం : పిఆర్‌టియు ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం స్థానిక రిటైర్డ్ ఎంప్లాయిస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల హక్కుల కోసం పోరాడి ప్రభుత్వాలును ఒప్పించి సమస్యల పరిష్కారానికి పిఆర్టియు కృషి చేసిందన్నారు. సమస్యల పరిష్కారంలో కృషి చేసిన అప్పటి నాయకులు అయిన మోహన్ రెడ్డి, సుధాకర్ రెడ్డిలు కృషి మరువలేనిదన్నారు. ఈ సందర్భంగా పిఆర్టియుకు విశేష కృషి చేసిన జెడ్ నాగిరెడ్డి రిటైర్డ్ ఎంఇఒ, టి.సురేష్ బాబు రిటైర్ హెచ్ఎం, సి.హెచ్.చలపతిరావు, టి.వెంకటేశ్వరరావు, పి.గోపాల్, జెడ్ నరసింహారెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రాఘవ రాజు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కె.రాజశేఖర్, మైలవరం మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.గోపాల్, ఎం.వెంకటేష్, రాష్ట్ర కార్యదర్శి ఎ.పుల్లారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు పి.సూరిబాబు, విశ్రాంత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్వి సారథి రావు వర్ధంతి

సారథి రావు విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - మైలవరం : ఎస్.వి.సారథి రావు వర్ధంతిని సిపిఎం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక నూజివీడు రోడ్‌లోని గాంధీ గ్రంథాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి సి.హెచ్. సుధాకర్ మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల వారి అభ్యున్నతి కోసం ఎస్.వి.సారథిరావు ఎన్నో పోరాటాలు చేశారన్నారు. మైలవరం పరిసర ప్రాంతాల్లో భూ పోరాటాల్లో పాల్గొని పేదలకు భూమి దక్కేలా కృషి చేశారన్నారు. నేటి తరం నాయకులు ఎస్.వి.సారథిరావును ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు రావూరి రమేష్ బాబు, లంక వెంకటేశ్వరరావు, రావుల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఇన్సురెన్స్ బాండ్‌లు అందజేత

ప్రజాశక్తి - వత్సవాయి : జనసేన అభివృద్ధికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సాయి శక్తుల కృషి చేస్తున్నట్లు జగ్గయ్యపేట నియోజకవర్గ జనసేన సమన్వయ కర్త బాడిచ మురళీకృష్ణ అన్నారు. వత్సవాయి మండలం కంభంపాడు గ్రామంలో జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ జనసేన శ్రేయిల కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జనసేన క్రియాశీలక సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలను కలిసి పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్, సాంకేతికతను ఉపయోగించి ఆస్త్రా యాప్ ద్వారా క్రియాశీలక సభ్యులకు వారి ఐడి కార్డులను, ఇన్సూరెన్సు బాండ్‌లను అందజేశారు.

గంజాయి కేసులో ఇద్దరు అరెస్ట్

పోలీసుల అదుపులో నిందితులు, స్వాధీనం చేసుకున్న గంజాయి

ప్రజాశక్తి - విజయవాడ : అజిత్ సింగ్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నందమూరి నగర్ ఏరియాలో ఒక మహిళను, ఒక వ్యక్తిని అదుపులోనికి తీసుకుని తొమ్మిది కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసిన ఘటన ఆదివారం జరిగింది. విజయవాడ నందమూరి నగర్ ఏరియాకి చెందిన యోగానంద సునీత, సింగినగర్ పిఅండ్ టి కాలనీకి చెందిన చేబ్రోలు నవీన్ బాల ప్రశాంత్ కుమార్‌లను పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రశాంత్ కుమార్ ఐటిఐ వరకు చదువుకొని ఒక బట్టల షాపులో పనిచేస్తూ అప్పుడప్పుడు ఈవెంట్లలో ఫొటోలు తీయడానికి వెళ్తుంటాడు. ఈ క్రమంలో సంవత్సరం క్రితం ఒక ఈవెంట్‌లో సునీత పరిచయమైంది. ప్రశాంత్‌కు గంజాయి, మద్యం వంటి చాలా చెడు అలవాట్లు ఉండటంతో అప్పుడప్పుడు సునీత ఇంటికి వెళ్ళి వాటిని సేవిస్తుంటాడు, ఈ క్రమంలో గంజాయిని ఆంధ్ర ఒరిస్సా బోర్డర్ ఏరియాల్లో కొనుగోలు చేసి విజయవాడ తీసుకొచ్చి విజయవాడలోని పలు ప్రాంతాల్లో యువకులకు అమ్మి వచ్చిన డబ్బులతో జల్సాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అజిత్ సింగ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నందమూరి నగర్ ఏరియాలో అక్రమంగా గంజాయి కలిగి ఉన్నారన్న పక్కా సమాచారం మేరకు టాస్క్ ఫోర్సు, అజిత్ సింగ్‌నగర్ పోలీస్ వారు వారి సిబ్బందితో కలిసి పైన తెలిపిన ఇద్దరినీ అదుపులోనికి తీసుకుని వారి వద్ద నుండి తొమ్మిది కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశారు. గంజాయిని అక్రమంగా తరలిస్తున్న వ్యక్తులను పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్లు శ్రీధర్ కుమార్, నాగ శ్రీనివాస్, అజిత్ సింగ్ నగర్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, వారి సిబ్బందిని అధికారులు అభినందించారు.

'పెద్ద' మనసుతో తాగునీటి సరఫరా

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండల కేంద్రం రాఘవాపురంలో మూడు రోజులుగా మంచినీటి పెద్దటితో ఇబ్బంది పడుతున్న ప్రజలకు ఉయ్యూరు వెంకటేశ్వర రెడ్డి (పెద్దబాబు) ఆధ్వర్యంలో ట్యాంకర్ ద్వారా మంచినీటి సరఫరా జరుగుతుంది. ఈ కార్యక్రమంలో డిసి వైస్ చైర్మన్ నరేడ్ల బాలకృష్ణారెడ్డి, ఉయ్యూరు కృష్ణారెడ్డి, ఒగ్గు నరసారెడ్డి పాల్గొన్నారు.

గోవులకు వరిగడ్డి వితరణ

ప్రజాశక్తి - వత్సవాయి : పెనుగంచిప్రోలు గ్రామంలో కొలువై ఉన్న శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం గోవులకు వత్సవాయి మండలం కొత్త వేమవరం గ్రామానికి చెందిన రైతు కాకాని నరసింహారావు 105 వరిగడ్డి కట్టలు సుమారు రూ.10 వేల విలువగల వరిగడ్డిని అమ్మవారి గోవులకు దానంగా సమర్పించారు. దాతకు ఆలయ డిప్యూటీ కమిషనర్, కార్య నిర్వహణ అధికారి, చైర్మన్ శ్రీనివాసరావు అభినందనలు తెలిపారు.

మద్యం దుకాణాల లాటరీ వాయిదా

ప్రజాశక్తి - తిరువూరు : గౌడ సామాజిక వర్గాలకు (గీత కార్మికులు) ప్రభుత్వం కేటాయించిన మద్యం దుకాణాల లాటరీ ప్రక్రియ వాయిదా వేసినట్లు ఎక్సైజ్ సిఐ శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. శాసనమండలి ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఈనెల 10న జరగాల్సిన మద్యం షాపుల లాటరీ ప్రక్రియ తాత్కాలికంగా ప్రభుత్వం వాయిదా వేసిందన్నారు. ఎలక్షన్ కమిషన్ అనుమతి తీసుకుని లాటరీ ప్రక్రియను నిర్వహించే తేదీని తదుపరి తెలియజేస్తామని సిఐ వెల్లడించారు.

'అమ్మ-నేను' వెబ్ సిరీస్ ప్రారంభం

ప్రజాశక్తి - వత్సవాయి : పెనుగంచిప్రోలు శ్రీ గోపయ్య సమేత శ్రీ తిరుపతమ్మ ఆలయంలో అమ్మ – నేను అనే వెబ్ సిరీస్‌కు క్లాప్ కొట్టి ప్రారంభించిన జిల్లా టిడిపి అధ్యక్షులు నెట్టెం రఘురాం ప్రారంభించారు. అనంతరం ఆలయంలో పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. తిరుపతమ్మ దేవస్థానానికి వచ్చే యాత్రికులు అమ్మ నేను అనే వెబ్ సిరీస్‌ను వినియోగించుకోవాలన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : కర్లపాటి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పౌష్టికాహార లోపం గల పిల్లలకు ఫిబ్రవరి మాసానికి పౌష్టికాహారాన్ని ఆదివారం అందజేశారు. పట్టణంలోని కర్లపాటి చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో ఎన్టీఆర్ జిల్లా ఆర్యవైశ్య సంఘ ప్రధాన కార్యదర్శి నాళ్ళ చినసత్యం బాబు చేతుల మీదుగా అందజేశారు. ఆ సంస్థ వ్యవస్థాపకులు సామాజికవేత్త కర్లపాటి వెంకట శ్రీనివాసరావు తెలిపారు. ట్రస్ట్ ఈ సేవా కార్యక్రమాన్ని భవిష్యత్తులో కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం 6 వేల రూపాయల విలువైన ఆహార సామాగ్రిని బాలలకు అందజేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాళ్ళ చిన్న సత్యం బాబు, శ్రేయసు ప్రతినిధి రాజశేఖర్, లక్ష్మి, ట్రస్ట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవ ఉజ్జీవ మహాసభలు

మహాసభల్లో మాట్లాడుతున్న ఎంఎల్ఎ శ్రీరాం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలోని చిల్లకల్లు రోడ్డులో బెతేస్తా గార్డెన్స్‌లో జరుగుతున్న బెతేస్తా పెంతకోస్తు క్రైస్తవ ఉజ్జీవ మహాసభల్లో ముఖ్య అతిథిగా శాసన సభ సభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య పాల్గొన్నారు. దైవజనులు దేవదాస్ నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య మాట్లాడుతూ ముందుగా ఈ రోజు బెతేస్తా మహాసభల వేదికల్లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. గతంలో రత్నరాజు, అబ్రహం ఉన్నప్పటినుండి కూటముల్లో తాము పాల్గొంటున్నామని తెలిపారు. అబ్రహం, తల్లి, ఫెయిత్ పాస్టర్‌కు, తమకు దేవుని ఆశీస్సులు ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ నకిరికంటి వెంకట్, కర్ల జోజి తదితరులు పాల్గొన్నారు.

ఆలపాటిని గెలిపించాలి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలోని శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ కార్యాలయంలో జగ్గయ్యపేట పట్టణ టిడిపి అధ్యక్షులు మేక వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఎమ్మెల్సీ ఎన్నికల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో శాసనసభ్యులు, ఎపి పిఏసి సభ్యులు, టిడిపి జాతీయ కోశాధికారి శ్రీరాం రాజగోపాల్ తాతయ్యతో కలిసి ఎమ్మెల్సీ ఎన్నికల నియోజకవర్గ పరిశీలకులు పిల్లి మాణిక్యాలరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య మాట్లాడుతూ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజాని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. జగ్గయ్యపేట నియోజకవర్గం నుంచి అత్యధిక భారీ మెజార్టీని అందించే దిశగా అందరూ కలిసికట్టుగా పని చేయాలన్నారు. ఓటు వేసే విధానాన్ని ప్రతి ఒక్క ఓటరుకు అర్థమయ్యేలా వివరించాలన్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు విద్యావంతులు మరియు మేధావులు ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలి అని అన్నారు.

ప్రసాదం అందజేస్తున్న దృశ్యం

లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్న మంత్రి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని వేదాద్రి గ్రామంలో గల శ్రీ యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానానికి దేవదాయ శాఖ మంత్రి ఆనం రాంనారాయణ రెడ్డి, ఓ.యస్ డి.వివేక్ సతీసమేతంగా స్వామిని దర్శించుకొన్నారు. దేవస్థాన కార్యనిర్వహణాధికారి కానూరి సురేష్ బాబు అర్చకులచే వారికి ప్రత్యేక పూజలు చేయించి అనంతరం సత్కరించి, ప్రసాదం అందజేశారు. యాత్రికుల సౌకర్యార్థం దేవస్థానంలో నిత్యం జరుగుతున్న అన్నదానానికి పెండ్యాల గ్రామం, కంచికచర్ల మండలం పెండ్యాల గ్రామానికి చెందిన వాబనబోయిన వెంకట కృష్ణారావు – చంద్రకళ రూ.10,001లు నగదు రూపంలో విరాళంగా అందజేసినట్లు కార్యనిర్వహణ అధికారికి తెలిపారు.

ప్రేమవిందు

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండల కేంద్రంలో ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ముంగమూరి దేవదాసు 65 వర్ధంతి సందర్భంగా నాగులూరు గ్రామానికి చెందిన దాసరి విజయ మహిమారావు ద్వారా పేదలైన వారికి ప్రేమవిందు (అన్నసంతర్పణ) నిర్వహించారు. వారికి సంస్థ నిర్వాహకులు చాట్ల విజయకుమార్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవ జి.విశ్వనాథ్, సువిశేషం, సంస్థ సెక్రటరీ హన్ను, కోశాధికారి సునీల్ తదితరులు పాల్గొన్నారు.

వాసవి భవన్ ఏర్పాటుకు విరాళాలు

ప్రజాశక్తి - గంపలగూడెం : ఊటుకూరులో వాసవి భవన్ ఏర్పాటుకై విరాళాలు సేకరిస్తున్నట్లు వాసవి కమిటీ తెలిపింది. ఆదివారం ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశం జరుగగా, హైదరాబాద్ కు చెందిన ప్రముఖ వైద్యులు వజినేపల్లి పుల్లారావు లక్ష విరాళాన్ని ప్రకటించారు. గ్రామానికి చెందిన వేముల ప్రకాష్ బాబ్జి రెండు సెంట్లు స్థలం ప్రకటించగా, ఈ సర్వేశ్వరరావు రూ.25వేలు, కాజా నాగేంద్రరావు రూ.25 వేలు, వి.మురళీ మోహన్ రూ.30వేలు ఈ సందర్భంగా ప్రకటించినట్లు ఆ కమిటీ పేర్కొంది.

రథోత్సవం

ప్రజాశక్తి - వత్సవాయి : శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం,పెనుగంచిప్రోలు, శ్రీ గోపయ్య సమేత తిరుపతమ్మ అమ్మవారికి రథోత్సవం నిర్వహించారు. యాత్రికులు, ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు. అమ్మవారి సేవలో డిప్యూటీ కమిషనర్ అధికారి కార్య నిర్వహణ అధికారి పాల్గొన్నారు.

ఏడుకొండలు కుటుంబానికి అండగా ఉంటాం : మంత్రి

ఏడుకొండలు కుటుంబంతో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : సముద్రంలోకి వేటకు వెళ్ళి తిరిగాని చింతా ఏడుకొండలు కోసం ప్రభుత్వం అన్ని విధాలా తీవ్రంగా గాలింపు చర్యలు చేస్తోందని రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. బందరు మండలం తాళ్ళపాలెం పంచాయతీ సత్రవపాలెం గ్రామానికి చెందిన చింతా ఏడుకొండలు వేటకు వెళ్ళి తిరిగి రాలేదు. ఈ నేపథ్యంలో ఆదివారం మంత్రి కొల్లు రవీంద్ర ఏడుకొండలు భార్య వెంకటేశ్వరమ్మ కుటుంబ సభ్యులను, బంధువులను పరామర్శించారు. ప్రభుత్వం అండగా నిలుస్తుందని భార్య వెంకటేశ్వరమ్మకు చెప్పారు. సామాన్యంగా వేటకు వెళ్ళిన వారు ఏదైనా ప్రమాదంలో చిక్కుకుంటే భౌతిక కాయాలు నీటిపై తేలేవి, లేకపోతే సముద్రం ఒడ్డుకు కొట్టుకువచ్చేవి. అయితే ఏడుకొండలు భౌతిక కాయం ఎంత గాలింపు చర్యలు చేస్తున్నా దొరకలేదన్నారు. బోటు యజమాని బలగం ఏడుకొండలు, చుట్టుపక్కల బోటు యజమానులు, మత్స్యశాఖ, మెరైన్, రెవెన్యూ అధికారులు తీవ్రంగా గాలింపు చర్యలు చేపట్టారన్నారు. అయితే ఏడుకొండలు భౌతిక కాయం ఇప్పటి వరకు కనబడకపోవడం దురదష్టకరమన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ప్రతి ఒక్కరూ సాంకేతిక పరిజ్ఞానాన్ని విధిగా వినియోగించుకోవాలన్నారు. పడవలు ఎలా ట్రాకింగ్ చేస్తారో అలా బోటుల్లో తిరిగే వారికి కూడా లైఫ్ జాకెట్లు వేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. శాటిలైట్ పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటున్నామన్నారు. జిల్లా కలెక్టర్ బాలాజీ ఏడుకొండలు గాలింపుపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఇప్పటికి ఏడుకొండలు భౌతిక కాయం పది రోజులయిందని, 15 రోజులు దాటితే ఆర్డీవో, డీఎస్పీ, మత్స్యశాఖ అధికారులతో పంచనామా చేయించి సర్టిఫికెట్లు తీసుకుంటామని, ప్రభుత్వం నుంచి రావలసిన అన్ని సహాయక చర్యలు అందిస్తామన్నారు. ఏడుకొం డలుకు తెలుగుదేశం సభ్యత్వం ఉందని, ఒకవేళ మతిచెందితే తెలుగుదేశం పక్షాన రూ. 5 లక్షల సాయం అందుతుం దన్నారు. తలవని తలంపుగా జరిగిన సంఘటనను కూడా మాజీ మంత్రి పేర్ని నాని రాజకీయం చేయడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గోపు సత్యనారాయణ, కుంచే నాని, లంకే శేషగిరిరావు, తలారి సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా ప్రాంగణం అభివృద్ధికి విరాళం

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణం అభివృద్ధికి వాకర్స్ అసోసియేషన్ పిలుపునందుకుని స్వచ్ఛందంగా ముందుకు వచ్చి శంకర నారాయణ భరద్వాజ శ్రౌతి , సీత దంపతులు లక్ష రూపాయలు విరాళాంగా అందజేసినట్లు గన్నవరం వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కేవిఆర్ కిషోర్ ఆదివారం పత్రికలకు తెలిపారు. వాకర్స్ అసోసియేషన్ కీడా ప్రాంగణం అభివృద్ధికి లక్షలాది రూపాయాలు వెచ్చించిన విషయం విదితమే. వాకర్స్ అసోసియేషన్ కార్యాలయం వద్ద ఈ సందర్భంగా శంకర నారాయణ భరద్వజ శ్రౌతి సీత దంపతులను వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమం లో రిటైర్డ్ పి.డి టి.యస్.ఆర్.కే ప్రసాద్, వాకర్స్ అసోసియేషన్ కార్యదర్శి సగ్గుర్తి శ్రీనివాస రావు, సలహాదారు తిరివీధి వెంకయ్య, గొల్లనపల్లి, గన్నవరం ప్రధాన ఉపాధ్యాయులు కొల్లి సత్య జగదీశ్వరరావు, రవి బాబు,సభ్యులు పాల్గొన్నారు. కాగా లక్ష రూపాయలు విరాళం అందించిన సీత శంకర నారాయణ భరద్వాజ సోదరీ మణి బావ కావడం విశేషం. అలాగే వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడా ప్రాంగణంలో అవ్యాన్ మల్టి స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులచే సభ్యులకు పరీక్షలు నిర్వహించారు. వాకర్స్ అసోసియేషన్ సభ్యులచే వైద్యులు ఝూన్సీ లక్ష్మీని సత్కరించారు.

పేదలకు అన్నదానం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : స్థానిక లయన్స్ సేవా భవనంలో దాతల సహకారంతో వందమంది పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. గవిర్నేనేని లలిత కుమారి జయంతి సందర్భంగా, వడ్లమూడి విజయలక్ష్మి వర్ధంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యుల వితరణతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు నిమ్మగడ్డ శశికళ, లయన్స్ సభ్యులు సూరపనేని పరంధామయ్య, జంగం మోహన్ రావు, సింగంశెట్టి ఆదినారాయణ, మూల్పూరి సుధాకర్, సి హెచ్ రాజా, దాతల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అన్నదానం చేస్తున్న దృశ్యం

సూర్యనారాయణ స్వామిని దర్శించుకున్న విక్కుర్తి

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ మండలం వేకనూరు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ ఉష పద్మిని సమేత సూర్య నారాయణ స్వామి ఆలయాన్ని ఆదివారం ప్రముఖ పరిశ్రామికవేత్త కూటమి నాయకులు విక్కుర్తి వెంకట శ్రీనివాసరావు దర్శించుకుని స్వామివారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు సోదరుడు విక్కుర్తి రాంబాబులను ఆలయ ధర్మకర్త తుంగల వీర వసంతరావు ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని జ్ఞాపికగా అందజేశారు. ఈనె నాలుగో తేదీన రథసప్తమి పర్వదినాన్ని ఆలయంలో ఘనంగా నిర్వహించిన ధర్మకర్త వసంతరావును శ్రీనివాసరావు అభినందించారు. అదేవిధంగా సూర్యనారాయణ స్వామి ఆలయం దివిసీమలోనే ప్రాచుర్యం కలిగిన దేవాలయం అని, ప్రతి ఆదివారం విశేషాలు స్వామివారి నిత్య కళ్యాణం అన్న సమారాధన నిర్వహిస్తున్న వసంతరావుకు శ్రీనివాసరావు అభినందనలు తెలిపారు.

నాసిరకం విత్తనాలతో రైతుకు నష్టం



ప్రజాశక్తి-చల్లపల్లి : నాసిరకం మొక్కజొన్న విత్తనాలు నిలువునా ముంచాయని రైతు, నడకుదురు గ్రామ సర్పంచ్ గొరిపర్తి సురేష్ ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచ్ సురేష్ చల్లపల్లి మండలం నడకుదురు, రాముడుపాలెం, మోపిదేవి మండలం కే.కొత్తపాలెం గ్రామాల్లో పదకొండు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేపట్టారు. ఘంటసాల మండలం శ్రీకాకుళంలో వెంకట పద్మావతి ట్రేడర్స్ లో 3,600 గ్రాముల బరువు ఉంటే విత్తనాల ప్యాకెట్ (సిజెంటా-6802) ఒక్కొక్కటి రూ.రెండు వేల చొప్పున సురేష్ 24 ప్యాకెట్ల విత్తనాలు కొనుగోలు చేసి తన మెట్ట భూముల్లో మొక్కజొన్న సాగు చేపట్టగా, 50 శాతం కూడా విత్తనాలు మొలకెత్తలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తనకు రూ.ఐదు లక్షల మేరకు నష్టం కలిగిందని సర్పంచ్ సురేష్ వాపోయారు. అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

కేశినేని ఫౌండేషన్ ద్వారా యువతకు శిక్షణ : ఎంపి

ప్రజాశక్తి-విజయవాడ : వికసిత్ పంచాయిత్‌లో భాగంగా విజయవాడ పార్లమెంట్ పరిధిలో 294 గ్రామాలను ఎన్.ఐ.ఆర్.డి సహకారంతో అభివృద్ధి చేసేందుకు 100 మంది యువతీ యువకులకు స్వయం ఉపాధి రంగంలో శిక్షణ ఇప్పించేందుకు ఎంపిక చేశారు. వీరిలో తొలివిడతగా తిరువూరు నియోజక వర్గం ఎ.కొండూరు మండల నుంచి తొమ్మిది మంది, మైలవరం నియోజకవర్గం జి.కొండూరు నుంచి ఎనిమిది మంది, జగ్గయ్యపేట నియోజకవర్గం జగ్గయ్యపేట రూరల్ మండలం నుంచి 8 మంది, నందిగామ నియోజకవర్గం వీరులపాడు మండలం నుంచి 8 మంది మొత్తం 33 మంది యువకులను హైదరాబాద్ ఎన్.ఐ.ఆర్.డి.పి.ఆర్ లో ఫ్రిబవరి 10 నుంచి 16 వరకు వారం రోజులు పాటు జరగబోయే శిక్షణ కార్యక్రమంకు ఆదివారం బస్సులో పంపించారు. గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్ నుంచి హైదరాబాద్ ఎన్.ఐ.ఆర్.డి.పి.ఆర్ కి ఆదివారం మధ్యాహ్నం బస్సు బయలుదేరింది. ఈ బస్సును ఏపీ బిల్డింగ్ అదర్ కనస్ట్రక్షన్ వర్కర్స్ అడ్వయిజరీ కమిటీ చైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు, ఆర్యవైశ్య డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్, మాజీ మేయర్ కోనేరు శ్రీధర్ జెండా ఊపి బస్సు ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయవాడ మాజీ మేయర్ కోనేరు శ్రీధర్, ఏపీ బిల్డింగ్ అదర్ కనస్ట్రక్షన్ వర్కర్స్ అడ్వయిజరీ కమిటీ చైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు, ఆర్యవైశ్య కార్పొరేషన్ డూండీ రాకేష్, మాట్లాడుతూ హైదరాబాద్ లోని ఎన్.ఐ.ఆర్.డి.పి.ఆర్ లో నవంబర్ 1, 2024న ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) స్వయం ఉపాధి అవకాశాలపై ఒక రోజు శిక్షణ తీసుకున్నారని, ఎన్.ఐ.ఆర్.డి సహకారంతో దేశంలోనే మోడల్ గ్రామాలుగా చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి , మాజీ ఫ్లోర్ లీడర్ ఎరుబోతు రమణ , ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ సొంగా సంజయ్ వర్మ. ఎన్టీఆర్ జిల్లా మైనార్టీ సెల్ ప్రెసిడెంట్ ఎస్ కే కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

జెండా ఊపి బస్సు ప్రారంభిస్తున్న దృశ్యం

టిడిపి సభ్యత్వ నమోదు విజయవంతం

మాట్లాడుతున్న బొబ్బా గోవర్ధన్

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ నియోజక వర్గంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయ వంతం చేసిన తెలుగుదేశం పార్టీ నేతలకు కార్యకర్తలకు ఎన్నారై టిడిపి నాయకులు బొబ్బా గోవర్ధన్ కతజ్ఞతలు తెలిపారు. ఆదివారం నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో విలేకరులతో గోవర్ధన్ మాట్లాడుతూ 6 మండలాల పార్టీ అధ్యక్షులు పార్టీ సీనియర్ నేతలు గ్రామ బూతు స్థాయి నేతలు విశేషంగా చేసిన కషి కారణంగానే నియోజకవర్గంలో పార్టీ సభ్యత్వాలు 42,022 చేరుకున్నాయని అన్నారు. అదే ఉత్సాహంతో ప్రభుత్వం చేస్తున్న అభివద్ధి సంక్షేమ కార్యక్రమాలను మరింతగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని గోవర్ధన్ సూచించారు. నియోజకవర్గం లో అత్యధికంగా కోడూరు మండలంలో 9503 సభ్యత్వాలు నమోదు అయ్యాయని, చల్లపల్లిలో 8412 ఘంటసాల మండలంలో 6703, శ్రీ మోపిదేవి మండలంలో 5323 అవనిగడ్డలో 4901 మంది తెలుగుదేశం పార్టీ సభ్యత్వాలు తీసుకున్నారని తెలిపారు.

అసంఘటిత కార్మికుల కాంగ్రెస్ జిల్లా చైర్మన్‌గా షేక్ అయ్యూబ్

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : అఖిలభారత అసంఘ టిత కార్మికుల కాంగ్రెస్ జిల్లా చైర్మన్‌గా కష్ణాజిల్లా మచిలీపట్నం అసెంబ్లీ నియోజక వర్గానికి చెందిన షేక్ అయ్యూబ్‌ను ఖరారు చేశారు. షేక్ అయ్యూబ్ కాంగ్రెస్ పార్టీలో చురుకైన కార్యకర్తగా పనిచేస్తున్నారు. వత్తిరీత్యా ద్విచక్ర వాహనాల సీనియర్ మెకానిక్ గా పనిచేస్తూ కార్మిక సంఘంలో మంచి గుర్తింపు పొందిన నాయకునిగా కొనసాగుతున్నారు. ఈ సందర్భంగా షేక్ అయ్యూబ్ మాట్లాడుతూ అసంఘటిత కార్మికుల జిల్లా చైర్మన్ గా నియమించిన పిసిసి చీఫ్ వైయస్ షర్మిల కు ఆల్ ఇండియా అసంఘటిత కార్మికుల కాంగ్రెస్ చైర్మన్ డాక్టర్ ఉదిత్ రాజ్ కి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు గొల్లు కష్ణకి కష్ణాజిల్లా పరిశీలకులు మార్నీడి బాబ్జి కి కతజ్ఞతలు తెలిపారు. ధనేకుల మురళీమోహన్ రావు ,మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గం కోఆర్డినేటర్ అబ్దుల్ మతీన్ పీసీసీ డెలిగేట్ కోకా ఫణి భూషణ్ కి కతజ్ఞతలు తెలిపారు.

రహదారి నిర్మాణ పనులు పరిశీలన

ప్రజాశక్తి-చల్లపల్లి : మండల పరిధిలోని లక్ష్మీపురం పంచాయతీ శివారు రామానగరం నుండి నూకల వారి పాలెం వెళ్లే రహదారి నిర్మాణ పనులను లక్ష్మీపురం సర్పంచ్ కొల్లూరు కోటేశ్వరరావు ఎంపిటిసి నిమ్మగడ్డ శ్రీనివాసరావు తో కలిసి ఆదివారం పరిశీలించారు. గత కొన్ని సంవత్సరాల నుండి అభివద్ధికి నోచుకోకుండా గుంతల మయంగా మారిన రామానగరం నుండి నూకల వారి పాలెం వెళ్లే ప్రధాన రోడ్డు నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. రహదారి నిర్మాణ పనులను పరిశీలించడంతోపాటు ప్రజల ఇబ్బందులను గుర్తించి శిథిలావస్థలో ఉన్న రహదారి నిర్మాణానికి ముందుకు వచ్చి నిర్మాణం చేపడుతున్న రాజాను అభినందించారు.

ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యత

మంత్రి సత్యకుమార్ యాదవ్

అత్యాధునిక పెద్దేశ్వర్ హెల్త్‌కేర్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : ప్రజారోగ్యానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని, ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పెద్దేశ్వర్ హెల్త్ సెంటర్‌ను అత్యాధునికంగా తీర్చిదిద్దడం అభినందనీయమని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. స్టేట్ ఆఫ్ ది ఆర్ట్ మల్టీ స్పెషాలిటీ, ట్రామా, క్రిటికల్ కేర్ సెంటర్‌గా ఆధునీకరించబడిన పెద్దేశ్వర్ హెల్త్ కేర్ సెంటర్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. సూర్యారావుపేటలో జరిగిన ఈ కార్యక్రమానికి మంత్రి కొల్లు రవీంద్ర, ప్రభుత్వ విప్ బొండా ఉమామహేశ్వరరావు, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ రావు, స్టార్ హాస్పిటల్స్ ఎండీ మన్నవ గోపీచంద్ తదితర ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు కూటమి ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోందని అన్నారు. ప్రత్యేక కేంద్రాల ద్వారా కేన్సర్ నిర్ధారణ పరీక్షలు, నేత్ర పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా విస్తృత స్థాయిలో ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నామని, పేద ప్రజలకు సైతం కార్పొరేట్ వైద్యాన్ని అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. గత పాతికేళ్లుగా ప్రజలకు అతి తక్కువ ఖర్చుతో సేవలందిస్తున్న డాక్టర్ పల్లెం పెద్దేశ్వరరావు ప్రస్థానం అమోఘమని మంత్రి కొనియాడారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో ఆసుపత్రికి అభివృద్ధి చేసి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందుబాటులోకి తేవడం ఆదర్శనీయమని పేర్కొన్నారు. అనంతరం, పెద్దేశ్వర్ హెల్త్ కేర్ సెంటర్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పల్లెం పెద్దేశ్వరరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలోనే అతిపెద్ద క్రిటికల్ కేర్ సెంటర్‌గా ఆధునీకరించబడిన నూతన హాస్పిటల్ ద్వారా ఈ ప్రాంత ప్రజలకు మరింత విస్తృతంగా సేవలందిస్తామని అన్నారు. హాస్పిటల్ సిఇఒ డాక్టర్ ఆకాశ్ పల్లెం మాట్లాడుతూ 'కార్పొరేట్ క్వాలిటీ.. ఎఫర్డబుల్ రియాలిటీ' నినాదంతో ఈ ప్రాంత ప్రజలకు తక్కువ ఖర్చుతో ప్రపంచ స్థాయి వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో నిరంతరం కృషి చేస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో మరెక్కడా లేని విధంగా అంతర్జాతీయ ప్రమాణాలతో అతిపెద్ద క్రిటికల్ కేర్ సెంటర్‌గా తమ హాస్పిటల్‌ను తీర్చిదిద్దామన్నారు. మొత్తం 150 బెడ్లు 8 ఐసియులతో 100 క్రిటికల్ కేర్ బెడ్లతో వివిధ విభాగాల వైద్య సేవలను ఒకేచోట అందిస్తామని తెలిపారు. కార్డియాలజీ, కార్డియోథొరాసిక్ సర్జరీ, పల్మనాలజీ, క్రిటికల్ కేర్, న్యూరాలజీ, న్యూరో సర్జరీ నెఫ్రాలజీ, యూరాలజీ, ఆర్థోపెడిక్, ట్రామా తదితర విభాగాలకు సంబంధించిన అనుభవజ్ఞులైన వైద్య నిపుణులు పెద్దేశ్వర్ హెల్త్ కేర్ సెంటర్‌లో సేవలందిస్తారని డాక్టర్ ఆకాశ్ వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సిహెచ్.ప్రసాద్ బాబు, డాక్టర్ ఎస్.భాను ప్రభాకర్, డాక్టర్ వి.సుశాంత్ రెడ్డి, డాక్టర్ సింధు చాగంటి, డాక్టర్ పవన్ సాయి పోతుల, డాక్టర్ కె.శ్రీనివాస్ బాబు, డాక్టర్ రామ్ ప్రతాప్ కొనకళ్ల, డాక్టర్ కె.రామ్ మోహన్ పాల్గొన్నారు.

హెల్త్‌కేర్ సెంటర్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రులు కొల్లు, సత్యకుమార్, తదితర ప్రముఖులు

దుర్గమ్మను దర్శించుకున్న నాగచైతన్య

ప్రజాశక్తి , వన్ టౌన్ : సినీ హీరో అక్కినేని నాగచైతన్య విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. ఆదివారం ఉదయం విజయవాడకు చేరుకున్న "తండేల్" చిత్ర బందం సభ్యుల తో కలిసి ఇంద్రకీలాద్రిపై కొలువైన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తండెల్ మూవీ ప్రమోషన్‌లో భాగంగా విజయవాడ వచ్చిన హీరో నాగచైతన్య, నిర్మాత బన్నీ వాసు, డైరెక్టర్ చందు మొండేటి లకు ఆలయ అధికారులు ,పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, జనసేన రాష్ట్ర కార్యదర్శి అమ్మిశెట్టి వాసు ఎన్డీయే కూటమి నేతలు ఘనంగా స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం అనంతరం ఆలయ అర్చకులు వారికి వేదాశీర్వచనాలు చేసి అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు.

గ్రంథాలయంలో చదువంటే మాకిష్టం

విజయవాడ : ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో 'చదువంటే మాకు ఇష్టం' కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులకు గణితంలో మెళకువలను నేర్పించినట్లు గ్రంథాలయ అధికారి కె.రమాదేవి తెలిపారు. స్పీడ్ మ్యాథ్స్ విద్యార్థులందరూ బాగా ప్రాక్టీస్ చేసి లెక్కలను సులువుగా ఎలా చేయాలో నేర్పించేందుకు గణితంలో ఎంతో అనుభవం ఉన్న ఉపాధ్యాయులు చలసాని సాంబశివరావు వివరంగా బోధించారు. విద్యార్థులందరూ నేటి కాలంలో గణితంలో ప్రజ్ఞాపాటవాలు ప్రదర్శిస్తే జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకుంటారని విద్యార్థులు అందరూ లెక్కలలో మెళకువలు నేర్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కరాటేలో రేవంత్ డిఫెన్స్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - తిరువూరు : అంతర జాతీయ స్థాయి కరాటే పోటీల్లో 2025 ప్రపంచ కరాటే రికార్డులో తిరువూరు రేవంత్ డిఫెన్స్ స్కూల్ విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచారు. ఈ నెల ఎనిమిదో తేదీన అంతర్జాతీయ స్థాయి, బోధిస్ వరల్డ్ రికార్డు చెన్నైలో నిర్వహించిన చాంపియన్షిప్‌లో రేవంత్ డిఫెన్స్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. సబ్ జూనియర్ కట్టా విభాగంలో ఆచంటి దుహిత సాయి, ఉరవకొండ నెన్సీ, జూనియర్స్ విభాగంలో నోముల శ్రీశ్రాకృత్యా, మోదుగు వశిష్ఠ, వంగూరి లీలాజై ప్రథమస్థానం, సోమయాజుల కాశీ విశ్వనాథ్ బోదిస్ ప్రపంచ రికార్డు, ఛాంపియన్షిప్ సాధించినట్లు సీనియర్ కోచ్ మరకాల రేవంత్ కుమార్‌గా ఆదివారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా తల్లితండ్రులు కోచ్ రేవంత్ కుమార్‌కు అభినందనలు తెలిపారు.

కెఎస్ లక్ష్మణరావు గెలుపు కోరుతూ ప్రచారాలు

విజయవాడ : (రూరల్) ఉమ్మడి కృష్ణా – గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎన్నికల్లో కె.ఎస్ లక్ష్మణరావు గెలుపు కోరుతూ పలుచోట్ల ప్రచారాలు నిర్వహించారు. విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడులో వివిధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కోశాధికారి కెఆర్‌కె.మూర్తి , ఎన్టీఆర్ జిల్లా అంగన్వాడి వర్కర్స్ (అండ్) హెల్పర్స్ యూనియన్ ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.సిహెచ్.సుప్రజ, జిల్లా ఆశ వర్కర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఏ.కమల మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్స్ సమస్యలపై రాజీలేని పోరాటం చేసే ఎమ్మెల్సీ అభ్యర్థి, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ నెల 10న (సోమవారం) నాడు జరుగుతున్న కెఎస్ లక్ష్మణరావు నామినేషన్ దాఖలు కార్యక్రమంలో కూడా అధిక సంఖ్యలో పాల్గొని ఆ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ ఎన్నికల్లో ప్రజాబలం ముందు డబ్బు, కులం బలం ఓడిపోక తప్పదని పేర్కొన్నారు. అటు శాసన మండలిలో, ఇటు బయట ప్రజాసమస్యలపై నిరంతరం పని చేస్తున్న లక్ష్మణరావు గెలుపుకోసం ప్రతి ఒక్కరూ పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విజయవాడ రూరల్ మండలం యుటిఎఫ్ మండల అధ్యక్షులు దేవ్, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఎం.సోమేశ్వరరావు, బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు శ్రీ.రాములు, సిఐటియు మండల కార్యదర్శి పి.వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు. **విజయవాడ :** స్థానిక కృష్ణలంక 22 డివిజన్లో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కెఎస్.లక్ష్మణ్‌రావు విజయాన్ని కాంక్షిస్తూ ఓటర్లలో ప్రచారాన్ని నిర్వహించారు. ప్రతి ఓటర్‌ను కలుస్తూ, కరపత్రాన్ని పంపిణీ చేస్తూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు తూర్పు సిటీ కమిటీ ఉపాధ్యక్షులు బత్తుల చిన్నారావు మాట్లాడుతూ ఈ నెల 27న జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావుకు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి, అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పౌర సంక్షేమ సంఘం నాయకులు తూబాటి తాండవ కష్ణ, మధ్యతరగతి సంఘం నగర నాయకులు కొమ్మూరి ఆనంద్, సిఐటియు నాయకులు ఎస్ బాపనయ్య, పౌర సంక్షేమ సంఘం నాయకులు ఎస్.కె నాగూర్ మీరా, చిన్న తదితరులు పాల్గొన్నారు. **జగ్గయ్యపేట :** కెఎస్ లక్ష్మణరావును గెలిపించాలని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. నిరంతరం కార్మికులకు, ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు అందుబాటులో ఉండే వ్యక్తి కెఎస్.లక్ష్మణరావుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్.శ్రీనివాస్ కోరారు. ఆదివారం పట్టణంలో విజ్ఞాన్ నగర్, కాకాని నగర్, ఆర్టీసీ కాలనీ తొర్రగుంటపాలెంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ సిహెచ్.శ్రీనివాస్, నాయకులు కోట రవికుమార్, ఎస్.ప్రణయ్ తేజ, దాసరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. **జి.కొండూరు :** జి.కొండూరులో ప్రజా సంఘాలు ప్రచారం నిర్వహించాయి. లక్ష్మణరావుకు మొదటి ప్రాధాన్య ఓటును వేయాలని పట్టభద్రులను ప్రజా సంఘాలు కోరాయి. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, పంది సాంబశివరావు, పి బాబురావు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. **ఎ.కొండూరు :** కె.ఎస్.లక్ష్మణరావు గెలుపు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, కర్షక, నిరుద్యోగ యువతీ యువకులకే కాకుండా ప్రజా ఉద్యమాలకు నాంది పలుకు తుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్ స్పష్టం చేశారు. ఎ.కొండూరు మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో ఆదివారం ఉపాధ్యాయ ఓటర్లను కలిసి లక్ష్మణరావుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కళ్యాణ్ ప్రజా సంఘాల నాయకులతో కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు జెట్టి వెంకటేశ్వరావు, యుటిఎఫ్ మండల కార్యదర్శి ఇస్సాక్, అధ్యక్షులు దుర్గారావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పానెం ఆనందరావు, బి.మురళి, బి.శ్రీరాములు పాల్గొన్నారు. **విసన్నపేట :** విస్సన్నపేట మండలం కొర్లమండ గ్రామం లక్ష్మీపురం గ్రామంలో కెఎస్.లక్ష్మణ్ రావును ఎమ్మెల్సీగా గెలిపించాలని విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నాగరాజు గ్రామాలు పర్యటించి కరపత్రాలు పంపిణీ చేయడం జరిగింది.

విజయవాడలో ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

విజయవాడ రూరల్‌లో సమావేశం

జగ్గయ్యపేటలో ప్రచారం...

విస్సన్నపేటలో ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

ఎ.కొండూరులో ప్రచారం

జి.కొండూరులో ప్రచారం

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.